ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 21 మే 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32 (మంగళవారం)
కనిష్ఠం : 28

తీరాన... అందాల హరివిల్లు!

చూసొద్దాం రండి..



6

మహానాడులో మనోళ్లు!

- నిర్వహణ కమిటీలో నేతలకు ప్రాధాన్యం
- తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా యనమల

రాజమహేంద్రవరం/అమలాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : అధికార తెలుగుదేశం పార్టీ ఈనెల 27, 28, 29వ తేదీల్లో కడపలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మహానాడుకు సంబంధించిన కమిటీల్లో ఉమ్మడి జిల్లా వారిలో పలువురికి చోటుదక్కింది. మొత్తం 19 కమిటీలను నియమించగా, రెండు కమిటీలకు కన్వీనర్లను ఉమ్మడి జిల్లా నేతలకు అప్పగించడం గమనార్హం. పలు కమిటీల్లో పలువురు ఎమ్మెల్యేలు, నేతలకు ప్రాధాన్యత లభించింది. మాజీ ఆర్థికమంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. సభా స్థలంలో సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ కన్వీనర్‌గా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నియమితులయ్యారు. భోజనాల కమిటీ కోకన్వీనర్‌గా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) నియమితులయ్యారు. రవాణా కమిటీ సభ్యుడిగా గోపాలపురం ఎమ్మెల్యే, బడ్జెట్ ఎస్టిమేట్స్ కమిటీ సభ్యుడు మద్దిపాటి వెంకట్రాజు నియమితులయ్యారు. సభా ప్రాంగణం పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్యే, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌కు స్థానం దక్కింది. అలాగే సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ సభ్యుడిగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్, రాష్ట్ర శెట్టిబలిజ సాధికారిక సమితి కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు, జన సమీకరణ కమిటీ సభ్యుడిగా అమలాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ సభ్యుడు అయితాబత్తుల ఆనందరావును నియమించారు.



యనమల రామకృష్ణుడు

మంత్రి వాసంశెట్టి సుభాష్



చిరు జల్లులు : కాకినాడ నగరంలో కురుస్తున్న వాన

కాకినాడలో ఇలా...

రాజమండ్రిలో..

వానావరణం!

ఎండా పోయి.. వాన వచ్చే ఢాం ఢాం

- ఉదయం నుంచి వదలని వాన
- వరుణుడి దెబ్బకు భానుడు పరార్
- కాకినాడ జలమయం
- కరపలో అత్యధిక వర్షపాతం
- నేడు, రేపు కూడా వానలు
- ఊపిరిపీల్చుకున్న జనం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఒక పక్క తీవ్ర ఎండలు.. భరించలేని వేడి.. ఉక్కబోతతో అల్లాడుతున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజలకు మంగళవారం కురిసిన భారీ వర్షాలు ఉపశమనం కలిగించాయి. తెల్లవారుజాము నుంచీ రోజంతా అనేకచోట్ల ఓ మోస్తరు నుంచి కుండపోతగా వానపడడంతో జనం ఊపిరిపీల్చుకున్నారు. గడచిన కొన్ని వారాలుగా ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. కాకపోతే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టి సాయంత్రానికి చినుకులు పడుతున్నాయి. దీంతో రోజులో సగం ప్రజలు వేడి, ఉక్కబోతతో నరకం చూస్తున్నారు. అయితే సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా వాతావరణం మారింది.అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వాన కురిసింది. కొన్నిచోట్ల అయితే మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వానలు పడ్డాయి. దీంతో రోజంతా ఎండమాయమై చల్లని వాతావరణం కొనసాగడంతో జనం ఉపశమనం పొందారు. కాకినాడ నగరంలో భారీ వర్షం పడడంతో మెయిన్ రోడ్డు, మసీదుసెంటర్, లోతట్టు ప్రాంతాలన్నీ మోకాల్లోతు నీటిలో మునిగాయి.అనేక ఇళ్లల్లోకి సైతం నీరు వచ్చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కాకినాడ నగరంలో ఏకంగా 7.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కరప మండలంలో ఏకధాటిగా వానపడడంతో రాష్ట్రంలోనే అత్యధికంగా 6.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షం ధాటికి అనేక రహదారులు మునిగాయి. పంటచేలల్లోకి నీరు వచ్చి చేరింది. కాకినాడ రూరల్‌లో 5.5 సెం.మీ. నమోదైంది. కోనసీమ జిల్లాలోని మండపేటలో అతి తక్కువ వ్యవధిలో 4.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాకినాడ జిల్లా పెదపూడిలో 5, కాజులూరు మండలం ఆర్యవటంలో 4.8, పిఠాపురం, తాళ్లరేవు, రౌతులపూడిలో 2, కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 4.4, కపిలేశ్వరపురంలో 3.6, ఆలమూరు 2.1, ఆత్రేయపురం 1.2, తూర్పుగోదావరి జిల్లా కడియంలో 2, బిక్కవోలు 1.8, అనపర్తి 1.7 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. మరోపక్క రుతు పవనాల ప్రభావంతో బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో నేడు, రేపు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



అబ్బబ్బా ఇదేమి వాన : కరపలో నీట మునిగిన ఎంపీడీవో కార్యాలయం

ఈ వాహనాలకు ఇక పనిలేదు..



రేషన్.. వద్దు!

ఇకపై ఎప్పుడు కావాలంటే అప్పుడే రేషన్

- ఇక అక్రమాలకు బ్రేక్
- ఎండీయూ వాహన సేవలు రద్దు
- క్యాబినెట్‌లో నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 1,139 వినియోగం
- రూ.66.19 కోట్లతో కొనుగోలు
- ఇంకా 20 నెలల రుణం బాకీ
- 2,857 దుకాణాల్లో రేషన్

(కాకినాడ/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎండీయూ వాహన సేవలకు ప్రభుత్వం మంగళం పాడేసింది.పేదలకు బియ్యం పంపిణీ పేరుతో నాలుగున్నరేళ్ల వైసీపీ సేవలో తరించిన వాహనాలు ఇకపై రద్ద య్యాయి. ఇన్నేళ్ల కొనసాగుతున్న దందాకు ప్రభుత్వం చెక్ పెట్టింది. రేషన్ బియ్యం ఇకపై రేషన్ దుకాణాల్లోనే తెచ్చుకునే వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ మంగళవారం నిర్ణయం ప్రకటించింది.

1 నుంచి దుకాణాల వద్దే..

లబ్ధిదారులకు బియ్యం, నిత్యావసరాలు అందించేందుకు గతంలో ఉండే చౌక డిపోల వ్యవస్థను జూన్ 1వ తేదీ నుంచి తిరిగి పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇకపై కార్డుదారులు నేరుగా తమ పరిధి లోని రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకోవచ్చని తెలిపింది. కాకినాడ జిల్లాలో 1,060 రేషన్ దుకాణాల్లో 6.43 లక్షల మంది కార్డుదారులు రేషన్ తీసుకోవాల్సి ఉంటుంది. కోనసీమ జిల్లాలో 926 రేషన్ దుకాణాల్లో 5.38 లక్షల మంది కార్డుదారులు, తూర్పుగోదావరి జిల్లాలో 871 దుకాణాల ద్వారా 5.65 లక్షల మంది కార్డుదారులకు ప్రభుత్వం నెలకు ఉమ్మడి జిల్లాలో 26 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ చేయనుంది. ఇకపై 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఏ సమయంలోనైనా లబ్ధిదారుడు చౌక దుకాణం వద్దకు వెళ్లి నేరుగా బియ్యంతో సహా ఇతర నిత్యావసర వస్తువులు పొందే అవకాశం ఉంది. దీనికితోడు దివ్యాంగులు, వృద్ధులకు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం వినూత్న చర్యలు చేపట్టనుంది. కాగా రాష్ట్రవ్యాప్తంగా చౌకడిపో డీలర్లు చేస్తున్న ఉద్యమాల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలకు బ్రేక్ వేశారు..

నెలలో తమకు కావాల్సిన సమయంలో కార్డుదారులు రేషన్‌దుకాణానికి వెళ్లి తెచ్చుకునే అవకాశం అమలవుతుండగా..గత వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచింది. కార్డుదారులకు నరకం చూపించింది. తొలుత ఇంటింటికి బియ్యం పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆనక మాట మార్చేసింది. ఒక కాలనీకి వెళ్లి ఈ ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనం సైరన్‌తో ప్రదర్శిస్తే గంటల తరబడి ఆ కాలనీ వాసులు వాహనం ఎదుట నిలబడి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితికి తెచ్చింది. ఆ రోజు వాహనం వద్దకు వెళ్లకపోతే ఆ నెల బియ్యం పోయినట్టే.ఈ వాహనం పేరుతో సదరు ఆపరేటర్లు కార్డుదారులపై రుబాబు చేసేవారు. బియ్యం ఇచ్చినట్టే ఇచ్చి అక్కడే తిరిగి కొనుగోలు చేసేవారు.ఆ బియ్యం తిరిగి వైసీపీ నేతల కనుసన్నల్లో నడిచే రేషన్ మాఫియాకు ఈ వాహనాలు తరలించేవి.ఇదే విషయాన్ని మంగళవారం నాటి క్యాబినెట్ సమావేశంలో మంత్రులు ప్రస్తావించారు.దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ ఎం డీయూ వాహనాలను రద్దు చేసింది.

కోట్లలో దుర్వినియోగం..

గత వైసీపీ ప్రభుత్వం సొంత ప్రచారానికి రేషన్‌దుకాణాలను నిర్వీర్యం చేసి ఈ ఎండీయూ వాహనాలను రుద్దింది. ఒక్కో వాహనాన్ని రూ.5.81 లక్షల చొప్పున బ్యాంకు రుణంపై కొనుగోలు చేసి ఆపరేటర్లకు అందించింది. మొత్తం 72 నెలల వాయిదాపై బ్యాంకు నుంచి 2021 ఫిబ్రవరిలో రుణం తీసుకుంది.కాకినాడ జిల్లాలో 420, తూర్పుగోదావరి జిల్లాలో 364, కోనసీమ జిల్లాలో 355 వాహనాలను బ్యాంకు నుంచి రూ.66.19 కోట్ల రుణం ద్వారా కొనుగోలు చేసింది.ఇప్పటికీ ఈ రుణాన్ని ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తోంది.ఇంకా ఇరవై నెలల బాకీ బ్యాంకుల్లో ఉంది. ఇప్పుడు ఈ వాహనాలను రద్దు చేసిన నేపథ్యంలో రూ.6.83 కోట్లు అప్పు తీర్చాల్సి ఉంది. ఈ ఎండీయూ వాహనాలను నడుపుతున్న వ్యక్తుల ఉపాధికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం వారికి ఆ వాహనాలను ఉచితంగానే అప్పగించడం ద్వారా ఎండీయూ వాహనాల నిర్వాహకులకు ఎటువంటి ఇబ్బందులు ఉండబోవనేది ప్రభుత్వం ఆలోచనగా ఉంది.

కోనసీమలో 21 మి.మీ వర్షపాతం

ముమ్మిడివరం, మే 20 (ఆంధ్రజ్యోతి): రుతుపవనాల ప్రభావంతో రెండ్రోజులుగా జిల్లాలో వర్షాలు కురవడంతో రబీ వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. మంగళవారం నాడు జిల్లాలో సరాసరి వర్షపాతం 21 మిల్లీమీటర్లు నమోదైంది. అత్యధికంగా రామచంద్రపురంలో 48 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా అత్యల్పంగా రాజోలు మండలంలో 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో రామచంద్రపురం, కె.గంగవరం, మండపేట, ముమ్మిడివరం, కొత్తపేట మండలాల్లో అధిక వర్షపాతం నమోదుకాగా, మిగతా 17 మండలాల్లో ఓ మాదిరిగా వర్షపాతం నమోదైంది. కాగా జిల్లాలో 1,64,529 ఎకరాల్లో రబీ వరి సేద్యం కాగా ఇప్పటి వరకు లక్షా 62 వేల ఎకరాల్లో వరి మాసూలు కాగా కోత దశలో 1600 ఎకరాలు మిగిలి ఉంది. మాసూలైన వరికి సంబంధించి 30 శాతం ధాన్యం రైతుల వద్ద కళ్లాల్లోనే ఉంది. మిల్లులకు తరలించేందుకు ఆటంకం ఏర్పడడంతో రైతులు దిగాలుపడ్డారు.



లూటుకుర్రులోని స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా

విద్యామిత్ర ద్వారా ఆరు రకాల వస్తువులు పంపిణీ

మామిడికుదురు, మే 20(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం ద్వారా విద్యార్థులకు ఆరు రకాల వస్తువులను కిట్ల రూపంలో పంపిణీ చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా తెలిపారు. మండలంలోని లూటుకుర్రు హైస్కూలులో గల విద్యామిత్ర కిట్ల స్టాక్ పాయింట్‌ను మంగళవారం డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సదుపాయాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారింది.. తెలుగుకు వెలుగొచ్చింది.. రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ చేసిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. నోటిఫికేషన్ జారీకి ఆమోదం తెలిపింది. రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటకు మార్గం సుగమమైంది. గోదావరి ప్రజల కోరిక తీరింది.





తెలుగు విశ్వవిద్యాలయ పీఠం ప్రధాన ద్వారం

తెలుగు..వెలుగు!

- పొట్టి శ్రీరాములు తెలుగు వర్శిటీకి ప్రాణం
- సీఎం చొరవతో కేబినెట్ ఆమోదం
- రాజమండ్రిలో ప్రధాన కార్యాలయం
- 1986లో పీఠానికి ఎన్టీఆర్ శంకుస్థాపన
- గోదావరి జిల్లాల్లో హర్షాతిరేకాలు
- రాష్ట్ర విభజన తర్వాత తొలి వర్సిటీ
- 55 ఎకరాలు ఇస్తే మిగిలింది 20

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉనికి కోల్పోయింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న విశ్వవిద్యాలయం పేరు మార్పుతోపాటు, ఏపీలోని తెలుగు వర్శిటీకి సంబంధించిన మూడు పీఠాల నిర్వహణ అధ్వానమైంది. 2016 వరకూ ఇక్కడ అన్ని కోర్సులు జరిగాయి. బొమ్మూరులోని తెలుగు పీఠంలో 2024- 25 నుంచి మొత్తం అడ్మిషన్లు ఆగిపోయాయి. ఈ నెల 3వ తేదీన ఎంఏ తెలుగు చివరి బ్యాచ్ పరీక్షలు పూర్తవడంతో ఈపీఠం ఉనికి ప్రశ్నార్థకమైంది. ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది.దీంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి, తెలుగు కళలకు పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం చిగురించింది. ఇక్కడ ఉద్యోగులకు జీతాలు రాని పరిస్థితి ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఓఎస్‌డీని నియమించి జీతాలు ఇస్తున్నారు.

1986లో ఆరంభించిన ఎన్టీఆర్..

తెలుగు సాంస్కృతిక, సాహిత్య వైభవం విరజిల్లిన ప్రాంతం రాజమహేంద్రవరం..ఈ నేపథ్యంలో 1986 ఏప్రిల్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ తెలుగు భాషను ప్రోత్సహించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయంలో భాగంగా బొమ్మూరులో పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ పీఠం ఏర్పాటుకు స్వయంగా శంకుస్థాపన చేశారు.శ్రీశైలం, కూచిపూడిలలో కూడా తెలుగు విశ్వవిద్యాలయ పీఠాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరంలో బొమ్మూరు కొండ మీద సుమారు 55 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. అడ్మినిస్ట్రేషన్ భవనం, తరగతుల నిర్వహణ, హాస్టల్, హాస్టల్ మెస్, నాలుగు క్వార్టర్స్ నిర్మించారు. బొమ్మూరు తెలుగు పీఠం ఓ వెలుగు వెలిగింది. విభజన నేపథ్యంలో పీఠం శిథిలస్థితికి చేరింది. క్యాబినెట్ నిర్ణయంతో మళ్లీ జీవం పోసుకుని ఇక్కడ తెలుగు విశ్వవిద్యాలయంగా విరాజిల్లనుంది. తొలి పీఠాధిపతిగా కొత్తపల్లి వీరభద్రరావు నియ మితులయ్యారు. ఎండ్లూరి సుధాకర్ హయాంలో రాష్ట్ర విభజన రావడంతో ఇది పూర్తిగా దెబ్బతింది. ఇక్కడ తెలుగు ఎంఏ,ఎంఫిల్, పీహెచ్‌డీ తరగతులు నిర్వహించేవారు. మొదట తరగతికి 25 మంది విద్యార్థులతో ఇది మొదలైంది. తర్వాత 30కి పెరిగింది. ఆరుగురు టీచింగ్ స్టాఫ్, 12 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ఉండేవారు. ఇక్కడ ప్రముఖ ప్రవచనకారుడు గరికిపాటి నరసింహారావు మొదటి ఎంఫిల్ పట్టాపొందారు.ప్రముఖకవి అద్దేపల్లి రామ్మోహనరావు, విమర్శకుడు ద్వానాశాస్త్రి ఇక్కడ పీహెచ్‌డీ చేశారు. మారిషస్ దేశం నుంచి వచ్చి ఇద్దరు ఇక్కడ పీహెచ్‌డీలు చేశారు.ఇక్కడ 300 మంది పీహెచ్‌డీలు చేయగా, సుమారు 450 మంది ఎంఫిల్ చేశారు. సుమారు 550 మంది తెలుగు ఎంఏ చేశారు. కాలువ మల్లయ్య వంటి ప్రముఖ కథా రచయితలు ఇక్కడ గోష్ఠుల్లో పాల్గొనడం గమనార్హం. ఇక్కడ 14 మంది ఉద్యోగులు మాత్రం ఉన్నారు. భవనాలు సుమారుగా శిథిలమయ్యాయి. కేవలం 20 ఎకరాల భూమి మిగిలింది. 29 వేల పుస్తకాలతో గ్రంథాలయం మాత్రం ఉంది.



చిట్టడవిలా ప్రధాన భవనం ఆవరణ

కేబినెట్‌లో ఏం జరిగిందంటే..

అమరావతిలో మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చట్టం 1985 లోని సెక్షన్ 3(2) ప్రకారం రాజమహేంద్రవరంలో ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఏపీలో విశ్వవిద్యాలయం కార్యకలాపాలు ప్రారంభానికి వీలు కల్పించింది. ఏపీలో ఉన్న మూడు సాహిత్య పీఠాలను నిర్వహణకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుందని కేబినెట్ విశదీకరించింది. రాజమహేంద్రవరంలో తెలుగు వర్శిటీ ఏర్పాటుపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.



చెట్లతో మూసుకుపోయిన ప్రధాన రహదారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

టవర్ల నిర్మాణంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కలెక్టర్ సమీక్షలో విద్యుత్‌శాఖ అధికారుల వెల్లడి

క్లోజర్ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

అమలాపురం, మే20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లావాసులకు విద్యుత్ డిమాండ్ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పవర్‌లైన్ల ఆధునికీకరణ పనుల నిర్వహణ కోసం విద్యుత్ పవర్‌కట్ అమలులో ఉంటుందని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలో రామచంద్రపురం డివిజన్, కొత్తపేట డివిజన్‌లోని ఆత్రేయపురం, కొత్తపేట, రావులపాలెం మండలాల్లో మినహా మిగిలిన మండలాల్లో ముందుగా ప్రకటించిన సమయాల్లో పవర్‌కట్ ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లో ఏపీ ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులతో పవర్‌కట్ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా 90 టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 60 టవర్లు నిర్మించామని, మిగిలిన 30 టవర్ల నిర్మాణానికి సంబంధించి రోజుకు 2 వంతున నిర్మిస్తున్నట్టు విద్యుత్‌శాఖ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. దీనివల్ల ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. సబ్‌స్టేషన్ నిర్వహణ, కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల పనులు చురుగ్గా సాగుతున్న తరుణంలో కలుగుతున్న అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు. విశాఖపట్నం జోనల్ చీఫ్ ఇంజనీర్ బి.శ్యామ్ ప్రసాద్, ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి..

జిల్లాలో కాల్వలు మూసివేత సమయంలో వివిధ గ్రాంట్ల కింద చేపట్టిన క్లోజర్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. డ్రైన్స్ అధికారులతో ప్రస్తుతం చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. కాల్వలు నీటి విడుదల సమయానికి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. జలవనరుల శాఖ ఈఈ బి.శ్రీనివాసరావు, జిల్లా డ్రైనేజీ విభాగం ఈఈ ఎంవీవీ కిశోర్‌తోపాటు ఆ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ సాగర తీరం

తీరాన... అందాల హరివిల్లు!


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం దిండిలో గోదావరి నదిలో బోటుపై విహారం

కాకినాడ టు కోనసీమ చుట్టొచ్చేద్దామా

పర్యాటకులకు ఇదొక చక్కని అనుభూతుల లోగిలి



అటు సముద్రం.. ఇటు గోదావరి. ఆ అంచున కడలి కెరటాలు.. వేటకెళ్లే బోట్లు.. ఈ అంచు గట్టున ప్రకృతిలో ఓలాలాడే చిరుగాలులు.. గోదారి పరవళ్లు. ఎటువెళ్లినా నీళ్లే.. అందాల హరివిల్లు చూడాలంటే ఇటు కాకినాడ వైపు.. అటు కోనసీమ వైపు వెళితే చాలు. ఒక్కోచోట ఒక్కో అందం.. ప్రకృతి సోయగాల మధ్య సేదతీరాలనుకునే వారికి ఇంతకంటే గొప్ప అనుభూతినిచ్చే ప్రదేశాలు ఉండవేమో. పర్యాటకులను ఉల్లాసపరిచే, వారికి ఆహ్లాదాన్ని పంచే, ఆధ్యాత్మిక అనుభూతిని మిగిల్చే ఆ లోకంలోకి వెళదాం రండి.. కాకినాడ జిల్లాలో పర్యటించాలనుకునే వారికి అతి ముఖ్యమైన వాటిలో అన్నవరం ఆలయ సందర్శన ఒకటి. అక్కడ నుంచి ఉప్పాడ సముద్ర తీరం, కాకినాడ బీచ్, కోరంగి మడ అడవులు చూసే శాక... మధ్య పుదుచ్చేరి రాష్ట్రంలో భాగమైన యానాం బీచ్‌లో అలా విహరించేసి కోనసీమ అందాలను చూసుకుంటూ ఓడలరేవును దాటుకుని దిండి రిసార్ట్స్‌లో బసచేసి, అక్కడి నుంచి అంతర్వేది ఆలయాన్ని, అక్కడి సముద్ర తీరాన్ని చుట్టేసి వస్తే.. కొన్నేళ్ల పాటు ఆ అనుభూతులు మనల్ని వెంటాడతాయని వేరే చెప్పాలా.. ఆ విశేషాలు ఇవిగో...

కోరింగ అభయారణ్యం... మడ అడవులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వన్యప్రాణుల అభయారణ్యం కోరింగ.. భారతదేశంలోని రెండో అతి పెద్ద మడ అడవులు ఇక్కడ ఉన్నాయి. 35 రకాల మడచెట్లు, 120కి పైగా పక్షి జాతులు ఉన్నాయి. నీటి పిల్లి లేదా ఏటి పిల్లి అనే వన్య ప్రాణి ఇక్కడ ప్రత్యేకత. కాకినాడ జిల్లా ప్రధాన కేంద్రమైన కాకినాడ నగరం నుంచి 18 కిలోమీటర్ల దూరంలో కోరింగ ఉంది. తీరం నుంచి కాకినాడను కాపాడే సహజసిద్ధ కోటగా కోరంగిని పిలుస్తారు. కోరంగిలో 300 మీటర్ల పొడవైన చెక్క వంతెనపై నడిచి అభయారణ్యాన్ని వీక్షించడం మధురానుభూతి.


కోరింగ అభయారణ్యంలో చెక్కల వంతెన


మడ అడవుల మధ్య కోరింగ అభయారణ్యం సొగసు చూడతరమా...

వాకలపూడి బీచ్...

కాకినాడ సాగర తీరం ప్రశాంతమైన వాతావరణంలో ఉంటుంది. నగరానికి సుమారు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కాకినాడ నగరంతో పాటు సమీప గ్రామాల ప్రజలు, జిల్లాలోని ఇతర ప్రాంతాల వాసులు కాకినాడ సాగర తీరానికి వస్తారు. 15 కిలోమీటర్లు పొడవైన ఈ ప్రాంతం తెల్లటి అలలతో అలరిస్తుంది. ఆటపాటలతో సందడి చేస్తారు. వాకలపూడి బీచ్‌లో పర్యాటకులకు అవసరమైన ఎన్నో సౌకర్యాలను ఏర్పాటు చేశారు. బీచ్ పార్క్, ఎమ్యూజ్‌మెంట్ పార్కు, గోకార్ట్ రేసింగ్, పారాచ్యూట్ వంటి ఎన్నో ఉన్నాయి.



సముద్రం మధ్యలో హోప్ ఐలాండ్ కూడా సందర్శనీయ స్థలం. కాకినాడ సాగర తీరం నుంచి బోటుపై ఆ ప్రాంతానికి చేరుకోవచ్చు. అయితే పోర్టు అధికారులు, మెరైన్ పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలి.

భక్తులకు అన్న'వరం'

అన్నవరం కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం. కోరిన కోర్కెలు తీర్చే అన్నవరం సత్యదేవుడు రత్నగిరిపై కొలువై ఉన్నారు. వీరవెంకటసత్యనారాయణ స్వామి ఆలయం అత్యంత విలక్షణమైనది. పురాణాల ప్రకారం ఇక్కడ సత్యదేవునికి ప్రత్యేక వ్రతాలు నిర్వహిస్తుంటారు. వ్రతం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల నమ్మకం. విశాఖ జాతీయ రహదారిలో కాకినాడకు 50 కిలోమీటర్ల దూరంలో ఈ దేవస్థానం ఉంది. సందర్శనీయమైన ఎన్నో



పురాతన ప్రదేశాలు ఈ ఆలయ ఆవరణలో ఉన్నాయి. పంపా నదిలో విహారం కూడా చేసే అవకాశం ఉంది.

పర్యాటకులను కట్టిపడేస్తున్న కోనసీమ అందాలు

దిండిలో నదీపాయలపై అలరిస్తున్న హౌస్‌బోట్లు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందచందాలకు కేరాఫ్ అడ్రస్ కోనసీమ. కేరళ తరహా అందాలను సొంతం చేసుకున్న ఈ ప్రాంతంలో ఏమారుమూల పల్లెకు వెళ్లినా ఆప్యాయతా అనురాగాలతో పలకరించే జనం. మర్యాదలతో ముంచెత్తే మనుషులు కనిపిస్తారు. కనువిందు చేసే ఎన్నో సముద్ర, గోదావరి నదీ తీర ప్రాంతాలతో పాటు ప్రకృతి రమణీయతను రంగరించే రీతిలో పచ్చని చేల చెంతన గలగల పారే సెలయేరు కాల్వల మధ్య సాదరంగా స్వాగతం పలికే కొబ్బరిచెట్ల సమూహాలమధ్య పయనించే ఏ పర్యాటకుడైనా ఫిదా కావాల్సిందే.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నదీ తీరప్రాంతాలతో పాటు మడ అడవులు, చమురు క్షేత్రాలు, ప్రసిద్ధి చెందిన ఆలయాలు పర్యాటకులను కనువిందు చేస్తాయి. గలగల పారుతున్న గోదావరిలో పడవ ప్రయాణం పర్యాటకులకు ఓ మధురానుభూతిని మిగులుస్తుంది. వశిష్ఠ నది చెంతన మలికిపురం మండలం దిండిలో కేరళ తరహాలో ఉన్న హౌస్‌బోట్లు ద్వారా నదీ విహారాలు సాగిస్తుంటారు. దిండి రిసార్ట్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వసతిగదులతో పాటు హౌస్ బోట్లు, వశిష్ఠ బోటు, స్పీడు బోట్లు ఉన్నాయి. గంటల వారీ ప్యాకేజీలు ఇక్కడ అమలు అవుతాయి. వైనతేయ నదీపాయ పేరున హౌస్‌బోటు ప్రత్యేక హంగులతో పర్యాటకులకు నదీ విహారం చేయనుంది. గోదావరి, వశిష్ఠ,



ఆత్రేయ పేర్లతో బోట్లు నదీపాయల్లో పర్యాటకులతో విహరిస్తాయి. ముఖ్యంగా హౌస్ బోటులో నలుగురు పెద్దవారు, నలుగురు పిల్లలకు ప్యాకేజీ రూ.15వేలు. గోదావరి బోటులో 20 మంది, వశిష్ఠ బోటులో 20 మంది, ఆత్రేయలో పది మంది పర్యాటకులు ఉంటే నదీ విహారానికి బయల్దేరతాయి. వీటిని ఆన్‌లైన్ ద్వారా కూడా బుక్‌చేసుకోవచ్చు. ఈ బోట్ ప్యాకేజీ కోసం దిండి రిసార్ట్స్‌లోని సెల్ 9848780524 ద్వారా సంప్రదించవచ్చు. ప్రస్తుతం కోనసీమలో దిండి రిసార్ట్స్ వద్ద ఉన్న హౌస్ బోట్ల విహారానికి పర్యాటకులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. వీటితో పాటు యానాం నుంచి సావేరీ బోటు ద్వారా సాగర సంగమ విహారం, బోడసకుర్రు, పాశర్లపూడి, ఆదుర్రు, సోంపల్లి, అంతర్వేది, సఖినేటిపల్లి, ఎదుర్లంక, దిండితో పాటు వివిధ నదీ పరివాహక ప్రాంతాల్లో బోటు షికార్లను ప్రైవేటు సంస్థలు ఏర్పాటుచేశాయి. వీటితో పాటు కాట్రేనికోన మండలం కందికుప్ప, తాళ్లరేవు మండలం కోరంగి నుంచి మడ అడవుల్లో పడవల ద్వారా విహార యాత్ర సాగించడానికి అటవీ శాఖ ఏర్పాట్లు చేసింది.

కోనసీమలోని మలికిపురం మండలం దిండిలో టూరిజం రిసార్ట్స్‌తో పాటు సమీపంలో మరో మూడు ప్రైవేటు రిసార్ట్స్ ఉన్నాయి. సోంపల్లిలో కోనసీమ రిసార్ట్స్, ఓడలరేవులో సముద్ర రిసార్ట్స్, అయినవిల్లిలో విల్లా రిసార్ట్స్, పాశర్లపూడి, యానాం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు రిసార్ట్స్ పర్యాటకులకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడ ఫుడ్ ప్యాకేజీలతో పాటు స్థానికంగా ఈ ప్రాంతంలో లభ్యమయ్యే ఎన్నో రకాల వంటకాలను పర్యాటకులు పసందైన విందుగాస్వీకరిస్తారు. వేసవి సీజను కావడంతో కోనసీమ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు రిసార్ట్స్ పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి.



ఉప్పాడ తీరం...

పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలంలో ఉన్న ఉప్పాడ తీరం మంచి పర్యాటక ప్రాంతం. ఉవ్వెత్తున ఎగసి పడే అలలు ఇక్కడ ప్రత్యేకం. ఓ పక్క సముద్రతీరానికి సమీపంలోనే నివాస గృహాలతో అక్కడంతా వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అంతేకాదు.. ఉప్పాడ చేనేత వస్త్రాలకు పుట్టినిల్లు. ఇక్కడ నేత నేసిన చీరలు దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందాయి. కాకినాడ నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉప్పాడ తీర ప్రాంతం ఉంది. ఎన్నో సినిమాల్లో సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు.



యానాం బీచ్

కాకినాడకు సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతం యానాం. పుదుచ్చేరి రాష్ట్ర పరిధిలోని ఈ పట్టణంలో ఓ పక్కన గోదావరి, మరోపక్క సముద్ర తీరం వుంటుంది. పర్యాటకులు సరదాగా గడిపేందుకు అనువైన ప్రాంతం. అంతేకాదు ఇక్కడ మద్యం ధరలు తక్కువ కావడంతో ఎక్కడెక్కడి నుంచో మందుబాబులు వచ్చి ఎంజాయ్ చేస్తారు. ఆంధ్రాకన్నా ఇక్కడ పెట్రోల్ ధరలు కూడా తక్కువే.

శివసదన్ కాటేజీకి రూ.10 లక్షలు విరాళం

అన్నవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మిస్తున్న శివ సదన్ కాటేజీకి మంగళవారం ఏలూరుకు చెందిన బుద్ధిరాజు లలితసుందరి, విశాఖపట్నానికి చెందిన కిండెపూడి వరలక్ష్మి సంయుక్తంగా రూ.10లక్షలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని దాతలు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామకృష్ణకు అందజేయగా ఆయన దాతలను అభినందించారు. కార్యక్రమంలో డ్రాఫ్ట్స్‌మెన్ సత్యప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామకృష్ణకు విరాళం అందజేస్తున్న దాతలు

డాక్టర్ యనమదలకు 'తపన' సేవా పురస్కారం

వచ్చే నెల 22న సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రదానం

కార్పొరేషన్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య, విజ్ఞాన రచనల ద్వారా ప్రజారోగ్య రంగంలో విశేష కృషి చేస్తున్న కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యుడు యనమదల మురళీ కృష్ణకు సత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన తపన సాహిత్య వేదిక సేవా పురస్కారం ప్రకటించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొవిడ్, ఎయిడ్స్‌పైన, ఇటీవలి కాలంలో పెరిగిపోతున్న గుండెజబ్బులపైన తన రచనల ద్వారా ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళీకృష్ణను ఈ ఏడాది సేవా పురస్కారానికి ఎంపిక చేసినట్టు తపన సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు, ప్రముఖ మాండలిక రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి తెలిపారు. డాక్టర్



మురళీకృష్ణ 2000లో ఎయిడ్స్‌పై, 2022లో కొవిడ్ ఎయిడ్స్ నేను, 2024 మే నెలలో హెచ్ఐవీ ఎయిడ్స్, జూన్ నెలలో హెచ్ఐవీ ఎయిడ్స్ ఇన్ ఇండియా అండ్ డెవలపింగ్ కంట్రీస్ పుస్తకాలను వెలువరించారు. ఈయన దాదాపు అన్ని ప్రధాన పత్రికలు, సామాజిక, ప్రసార మాధ్యమాల్లో ఆరోగ్య విశేషాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేశారు. కొవిడ్ సమయంలో ఈయన వ్యాసాలు, ఇంటర్వ్యూలు ప్రజలకు కొండంత భరోసానిచ్చాయి. రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, గంటేడ గౌరునాయుడు, డాక్టర్ దేవేంద్ర అవార్డుల ఎంపికలో న్యాయనిర్ణేతలుగా వున్నారు. జూన్ 22న హిందూపురంలో అవార్డు ప్రదానం చేస్తామని చిదంబరరెడ్డి చెప్పారు.

రెండో రోజుకు ఏపీఈఏపీసెట్

● ముగిసిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు

జేఎన్టీయూకే, మే20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు రెండో రోజు కూడా కొనసాగాయి. మంగళవారం నిర్వహించిన అగ్రికల్చర్,ఫార్మసీ పరీక్ష కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగినట్టు కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. రెండు సెషన్లలో మూడు జిల్లాల్లోని 9 కేంద్రాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5వరకు నిర్వహించారు.

● కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 918 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 856 మంది హాజరుకాగా 62మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 920మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 862 మంది హాజరు కాగా 58 మంది పరీక్ష రాయలేదని తెలిపారు.

● తూర్పుగోదావరి జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లకు కలిపి మొత్తం 1,285 మంది విద్యార్థులు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1,183 మంది హాజరు కాగా 102 మంది గైర్హాజరు కాగా 92.06 శాతం హాజరు నమోదైందన్నారు.

● అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 798 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 751 మంది హాజరుకాగా 47 మంది రాయలేదని, మొత్తం 94.11 శాతం హాజరయ్యారన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల ప్రాథమిక కీని బుధవారం విడుదల చేస్తామన్నారు. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు బుధవారం ప్రారంభమై ఈ నెల 27 వరకు కొనసాగుతాయని తెలిపారు.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

అనపర్తి, మే 20(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలోని నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ 36వ జాతీయస్థాయి ఆహ్వాన సాంఘిక నాటిక పోటీలు బుధవారం ప్రారంభంకానున్నాయి. స్థానిక నల్లమిల్లి సుబ్బిరెడ్డి స్మారక కళామందిరంలో నాలుగురోజులపాటు జరిగే పోటీలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పరిషత్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. 21న జనరల్‌బోగీలు, కిడ్నాప్, 22న(అ)సత్యం, నాన్న నేనొచ్చేస్తా, 23న విడాకులు కావాలి, కొత్త పరిమళం, నిశ్శబ్దమా నీ ఖరీదెంత, 24న చిగురుమేఘం నాటికలను ప్రదర్శిస్తారు..

పిఠాపురంలో తిరంగా యాత్ర

త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తున్నాం: వర్మ

పిఠాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయంలో త్రివిధ దళాలు చూపిన తెగువ, స్ఫూర్తికి సెల్యూట్ చేస్తూ కాకినాడ జిల్లా పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తిరంగా యాత్ర నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా జాతీయ జెండాలతో ప్రదర్శన జరిపి సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


తిరంగా యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వర్మ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కాశీకి 73వేల మట్టి శివలింగాలు

బిక్కవోలు, మే 20 (ఆంధ్రజ్యోతి): 73వేల మట్టి శివలింగాలు తయారు చేయించి కాశీకి పంపుతున్నట్టు బలభద్రపురానికి చెందిన కొవ్వూరి రామారెడ్డి (హిందీ మాస్టారు) భార్య అచ్చియ్యమ్మ మంగళవారం తెలిపారు. కొంకుదురు శివాలయంలో తయారుచేస్తున్న శివలింగాలను చూసి అక్కడి వారిని సంప్రదించగా తమకు మట్టి పంపారని... తనతో పాటు వంద మంది మహిళలు భక్తిశ్రద్ధలతో వీటిని నెలా పదిహేను రోజులు శ్రమించి తయారు చేశామని చెప్పారు.


బలభద్రపురంలో తయారు చేసిన మట్టి శివలింగాలు


కాకినాడ కలెక్టరేట్ ఎదుట వంట-వార్పు చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సీహెచ్‌వోల వంట-వార్పు

● కాకినాడ కలెక్టరేట్ ఎదుట వినూత్న నిరసన

కలెక్టరేట్ (కాకినాడ),మే 20 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ ఎదుట వినూత్నంగా నిరసన తెలిపారు. వంట-వార్పు ద్వారా ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు. ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్యమిషన్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతనాలు వర్తింపజేయాలన్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలన్నారు. ఈపీఎఫ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్ట జాబ్‌చార్టర్ ఇవ్వాలని,


భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

ఇంక్రిమెంట్లు, హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలని, జీతాల బకాయిలను త్వరితగతిన చెల్లించాలని నినదించారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తర్వాత కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. రఘు, వరకాంత్, నానాజీ, అనిల్, ప్రసన్న పాల్గొన్నారు.

తదుపరి చిత్రం రామ్‌చరణ్‌తోనే..

ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్



మలికిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): తన తదుపరి చిత్రం రామ్‌చరణ్‌తో ఉంటుందని ప్రముఖ సినీ దర్శకుడు బండ్రెడ్డి సుకుమార్ తెలిపారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మట్టపర్రు వచ్చిన ఆయన విలేకర్లతో ముచ్చటించారు. ఈ మధ్య సినిమాలకు గ్యాప్ ఎక్కువ వచ్చిందని అడగ్గా నవ్వి ఊరుకున్నారు. పుష్ప-2 చిత్రం ద్వారా జాతీయ స్థాయిలో తనకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సినిమాలను థియేటర్లలో, టీవీల్లో వీక్షిస్తున్నారని, పట్టణాల్లో యాప్‌లతో మమేకమవుతున్నారని తెలిపారు. తాను మొదటిగా పేపర్ చూసేటప్పుడు స్పోర్ట్స్, సినిమాలు, తరువాత రాజకీయాలు చదువుతానన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సుకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.కాసేపు మాట్లాడారు.



మలికిపురం మండలం మట్టపర్రులో ఓ బాలుడికి ఆటోగ్రాఫ్ ఇస్తున్న సుకుమార్

సిద్ధివినాయకుని హుండీల ఆదాయం రూ.27.68 లక్షలు



అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి హుండీలను మంగళవారం లెక్కించారు. 61 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.26,86,790, అన్నప్రసాదం ద్వారా రూ.81,491 వెరసి మొత్తం రూ.27,68,281 నగదుతో పాటు 4.4 గ్రాముల బంగారం, 436 గ్రాముల వెండి, 30 విదేశీ కరెన్సీ నోట్లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పర్యవేక్షణాధికారి జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీల లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకస్వాములు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోకోనట్ పార్కు, సీపీసీఎస్‌ల ఏర్పాటుపై అధ్యయనం

ఐదుగురు సభ్యులతో అధికారుల బృందం

కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో పర్యటన



మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్‌ఐ డైరెక్టర్ శ్రీదేవి అన్నపూర్ణను కలిసిన కోనసీమ జిల్లా అధికారుల బృందం

అమలాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనతో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోకోనట్ కామన్ ఫెసిలిటీ సెంటర్లు (సీపీసీఎస్) ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేపట్టింది. దీనిలో భాగంగా సాంకేతిక సరఫరా, వీటి స్థాపనకు అవసరమైన స్థలాలు మార్కెటింగ్ లింకేజెస్ వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల బృందం ఇతర రాష్ట్రాలకు వెళ్లింది. ఐదు రోజుల పాటు ఈ బృందం మైసూర్, కాసర్గోడ్, కొచ్చిన్, కోయంబత్తూర్‌లో పర్యటించనుంది. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచనలతో ఈ బృందాన్ని ఏర్పాటు చేశారు. దీనికి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి.ప్రసాద్ నాయకత్వం వహిస్తున్నారు. పీడీడీఆర్డీఏ జైచంద్ర గాంధీ, జిల్లా ఉద్యానశాఖాధికారి బీవీ రమణ, ఏపీ ఐసీసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, ఎల్డీఎం వర్మ తదితరులు ఉన్నారు. దీనిలో భాగంగా మైసూర్‌లోని కేంద్రీయ ఆహార పరిశోధనా సంస్థ (సీఎఫ్‌టీఆర్‌ఐ)ను సందర్శించారు. డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవిఅన్నపూర్ణతో పాటు ఇతర శాస్త్రవేత్తలతో సమావేశమై కొబ్బరి, అరటి వంటి తోట పంటల విలువ జోడింపు, ఉత్పత్తులపై పరిశోధన, ప్యాకేజింగ్, ఎగుమతులు వంటి అంశాలపై చర్చించారు. మంగళవారం కాసర్గోడ్‌లోని కేంద్రీయ తోట పంటల పరిశోధనాసంస్థ (సీపీటీఆర్‌ఐ)ను సందర్శించిన బృందం శాస్త్రవేత్తలతో మాట్లాడారు. రోగనిరోధకత కలిగిన కొబ్బరి రకాలు, కోనసీమ వాతావరణానికి అనుకూల వంగడాలపై అక్కడ శాస్త్రవేత్తలతో సమగ్రంగా చర్చించారు. ఈ నెల 21న కొచ్చిన్‌లోని కొబ్బరి అభివృద్ధి బోర్డు (కోకోనట్ డెవలెప్‌మెంట్ బోర్డు)ను సందర్శించనున్నారు. కొబ్బరి ఫైబర్ ప్రోసెసింగ్, కొబ్బరి ఉత్పత్తిని బ్రాండెడ్ ఉత్పత్తిగా తయారుచేయడం, క్వాయర్ పరిశ్రమలకు అవసరమైన యంత్ర పరికరాలను సేకరించనున్నారు. 22న కొచ్చిన చుట్టుపక్కల పరిసరాల్లో పర్యటిస్తారు. 23న తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రైవేటు కొబ్బరి పరిశ్రమల స్థాపన, వాటి నిర్వహణ, మార్కెటింగ్ అంశాల వంటి వాటిపై చర్చించనున్నారు. పర్యటన అనంతరం అధికారుల బృందం కలెక్టర్‌కు కోనసీమ జిల్లాలో కొబ్బరి ఉత్పత్తులు, ఫెసిలిటీ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి అధ్యయన నివేదికను సమర్పించనున్నారు.

సామర్లకోట-కాకినాడ రోడ్డులో వాహనాల రాకపోకలు యథాతథం

కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బ్రిడ్జిలకు గడ్డర్లు లేపే కార్యక్రమాలను వర్షాల వల్ల తాత్కాలికంగా వాయిదా వేశామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామర్లకోట నుంచి కాకినాడ మార్గంలో ముత్యాలమ్మ గుడి వద్ద ఓవర్ బ్రిడ్జి గడ్డర్ల పనుల నిమిత్తం నాలుగు రోజులు ట్రాఫిక్ మళ్లించాలని తొలుత నిర్ణయించామని, వర్షాల కారణంగా వాయిదా వేశామన్నారు. దీంతో సామర్లకోట- కాకినాడ కెనాల్ రోడ్డులో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగుతాయని, ఈ మార్పును వాహనచోదకులు గమనించాలని కోరారు.

పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభకు అనుమతివ్వాలి

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు అనుమతివ్వకపోతే క్రైస్తవ సంఘాలు ఎక్కడికక్కడ ఆందోళనకు దిగుతాయని అమలాపురం మాజీ ఎంపీ జీవీ.హర్షకుమార్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 24న కొంతమూరు సమీపంలోని ప్రకృతి వనం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే సభ అనుమతికి కోరగా పోలీసులు మాత్రం స్పందించలేదన్నారు. సంస్మరణ సభకు అనుమతిస్తే ఎవరి మనోభావాలకు భంగం కలగకుండా, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకుండ సభను నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

బాలిక ఫిర్యాదుతో నలుగురిపై పోక్సో కేసు

మలికిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): తనను మోసం చేశాడని యువకుడిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడితో పాటు మరో ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పీవీవీ.సురేష్ తెలిపారు. మలికిపురం మండలంలో బంధువుల ఇంటికి వచ్చిన ఏలూరుకు చెందిన ఎం.రాకేష్, 2023లో బాలికతో ప్రేమ వ్యవహారం నడిపి హైదరాబాద్‌కు వెళ్లి సహజీవనం చేశారు. వీరి మధ్య విభేదాలు రావడంతో పెద్ద మధ్య రాజీ ప్రయత్నం కుదరలేదు. దీంతో బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద యువకుడితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీ

అక్కడికక్కడే వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన చైతన్య జనార్దన

కొత్తపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందినట్టు కొత్తపేట ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కమ్మిరెడ్డిపాలానికి చెందిన ఓడా చైతన్యజనార్దన (36) రావులపాలెంలో పని నిమిత్తం సోమవారం కొత్తపేట నుంచి రాత్రి 11 సమయంలో మోటార్‌సైకిల్‌పై బయలుదేరి వెళ్లాడు. 1.45 సమయంలో కొత్తపేట తిరిగి వస్తుండగా మందపల్లి బ్రిడ్జి దాటిన తరువాత కల్యాణి సోంపాపిడి స్వీట్స్ షాపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా రావులపాలెం వెళ్తున్న మోటార్‌సైకిల్ ఎదురుగా ఢీకొనడంతో చైతన్యజనార్దన తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. దీనిపై అతడి భార్య ఓడా చిన్నారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా మరో మోటార్‌సైకిలిస్టుకు కూడా తీవ్రగాయాలు కాగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

24 గంటల్లో దొంగను పట్టేశారు

రూ.10 లక్షలు చోరీ

అన్నవరంలో నిందితుడి అరెస్టు



అన్నవరంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ సూరిఅప్పారావు

అన్నవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): రూ.10 లక్షల చోరీ కేసులో నిందితుడిని 24 గంటల్లో పట్టుకుని బాధితుడికి నగదును అందజేశారు. వివరాల్లోకి వెళితే హైదరాబాద్‌కు చెందిన బోడపాటి నాగేశ్వరరావు సోమవారం కాకినాడ జిల్లా తునిలో ఉన్న తన స్థలం విక్రయించి అడ్వాన్స్ రూపంలో రూ.10 లక్షలు నగదు, మరో రూ.10 లక్షలు చెక్ ద్వారా తీసుకున్నాడు. నగదును బ్యాగ్‌లో పెట్టుకుని తుని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కి అన్నవరంలో దిగాడు. అయితే అతని దృష్టిమరల్చి బ్యాగ్ కత్తిరించి నగదుతో నిందితుడు ఉడాయించాడు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన నాగేశ్వరరావు అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా పెద్దాపురం డీఎస్పీ ఆదేశాలతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంకబాబు, ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావులు నాలుగు టీంలుగా విభజించి దర్యాప్తు చేపట్టగా అన్నవరం జాతీయ రహదారిపై మండపం సెంటర్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న విశాఖపట్నానికి చెందిన కంబాల శ్రీనును అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నగదు తస్కరించుకున్నట్టు అంగీకరించడంతో అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ తెలిపారు. నిందితుడిని ప్రత్తిపాడు కోర్టులో ప్రవేశపెట్టినట్టు చెప్పారు. దొంతనం కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పెద్దాపురం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంకబాబు, ఏఎస్‌ఐ బలరాం, హెచ్‌సీ రాధాకృష్ణలను డీఎస్పీ అభినందించారు.

సముద్రంలో వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

సురక్షితంగా బయటపడ్డ మరో ఇద్దరు



గల్లంతైన శ్యామ్ (ఫైల్‌ఫొటో)

కొత్తపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): సముద్రంపై వేట నిషేధం అమలులో ఉన్నా ముగ్గురు యువకులు బోటులో వేటకు బయలుదేరారు. వాతావరణం బాగోకపోవడంతో కెరటాలు ఉధృతంగా ఉండటంతో వారి బోటు కెరటాల ధాటికి తిరగబడింది. దీంతో ఒకరు గల్లంతవ్వగా ఇద్దరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్‌కాలనీకి చెందిన మత్స్యకార యువకులు మేరుగు శ్యామ్(19), వంకా ఇస్సాక్, రామిశెట్టి వీరబాబు సోమవారం అర్ధరాత్రి కాకినాడ ఫిషింగ్ హార్బర్‌కు చెందిన మత్స్యకారుడి బోటుపై చేపల వేటకు వెళ్లారు. డీప్ వాటర్‌పోర్టు, హోప్ ఐలాండ్ మధ్య చేపలు వేటాడే క్రమంలో కెరటాల ఉధృతికి బోటు తల్లకిందులవడంతో ముగ్గురు సముద్రంలో మునిగిపోయారు. ఇస్సాక్, వీరబాబు ఈదుకుంటూ దగ్గర్లో హోప్ ఐలాండ్‌కు సురక్షితంగా చేరుకున్నారు. శ్యామ్‌కు ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడని సహచర మత్స్యకారులు సమాచారమిచ్చారు. దీంతో మంగళవారం ఉదయం 6బోట్లపై మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టినా శ్యామ్ జాడ తెలియలేదని రామకృష్ణ తెలిపారు.

ఉగ్రవాద కదలికలపై

ఉలిక్కిపడ్డ రంప మన్యం

రంప అడవుల్లో బాంబులు

పేల్చడంపై సర్వత్రా ఆందోళన

ఎన్‌ఐఏ విచారణలో అంశాలపై

విస్తుబోతున్న పోలీసువర్గాలు

రంపచోడవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద దాడులకు రిహార్సిల్స్‌గా రంప అడవులను ఎంచుకుని బాంబు పేలుళ్లను నిర్వహించిన అంశం రంప మన్యాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఇంతకాలం రంప అడవులు కేవలం మావోయిస్టు కార్యకలాపాలకే పరిమితమనుకుంటే ఇప్పుడు ఉగ్ర కార్యకలాపాల అమలు పరీక్షలకు కూడా ఏజెన్సీని వేదికగా చేసుకోవడం పోలీసువర్గాలను విస్తుబోయేలా చేస్తోంది. పాక్ ఉగ్రవాద వర్గాలకు సానుభూతిపరులుగా ఉన్న విజయనగరానికి చెందిన సిరాజ్ రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌లు ఉగ్రవాద చర్యలకు సహకరిస్తూ అందుకు కావాల్సిన పేలుడు పదార్థాలను సేకరించి వాటిని పరీక్షించేందుకు రంప అడవులను ఎంచుకున్నారని ఎన్‌ఐఏ వర్గాలు గుర్తించాయి. దీంతో అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే వారు రంప అడవులను తమ పేలుళ్ల రిహార్సిల్స్ కోసం ఎంచుకోవడాన్ని గ్రహించారు. వీరు ఇక్కడకు ఎలా రాగలిగారు, ఇక్కడ ఎన్ని రోజులున్నారు, ఎక్కడెక్కడ తిరిగారు అన్న అనేక అంశాలను లోతుగా విచారించే దిశగా ఎన్‌ఐఏ బృందాలు పనిచేస్తున్నట్టు సమాచారం.

తల్లితో వివాహేతర సంబంధం.. కూతురితో పెళ్లి చేయాలని బెదిరింపు

● యువతిపై దాడి ● నిందితుడిపై కేసు



నిందితుడు నాగిరెడ్డి

అనపర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): తల్లితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమె కుమార్తెపై కన్నేసి చంపుతానని బెదిరించాడో వ్యక్తి. అనపర్తి ఎస్‌ఐ శ్రీను నాయక్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన మహిళకు గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి ఇద్దరు అమ్మాయిలు సంతానం. 2016లో మహిళ భర్త చనిపోయాడు. భర్త చనిపోయిన 8 నెలలకు గ్రామానికి చెందిన పడాల నాగలక్ష్మీనారాయణ రెడ్డి అలియాస్ నాగిరెడ్డి పరిచయమయ్యాడు. అది కాస్తా సహజీవనంగా మారింది. ఆ మహిళ పెద్ద కుమార్తె పదో తరగతి చదివే సమయంలో తనకిచ్చి పెళ్లి చేయాలంటూ ఒత్తిడి తీసుకురావడంతో తల్లీ కూతుళ్లు నాగిరెడ్డిని ఇంటికి రాకుండా కట్టడి చేశారు. ఈ నేపథ్యంలో నాగిరెడ్డి మరో యువతిని వివాహం చేసుకున్నాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో ఇటీవల విడిపోయారు. అనంతరం తిరిగి పాత మహిళ వద్దకు చేరుకున్న నాగిరెడ్డి బీటెక్ చదువుతున్న పెద్ద కుమార్తెపై కన్నేశాడు. ఈ క్రమంలో గత నెల 30న రాత్రి వారి ఇంటికి వెళ్లి వివాహ విషయంపై గొడవ పెట్టుకుని తల్లి కుమార్తెను చిత్రహింసలకు గురిచేశాడు. యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. పెళ్లి చేయకపోతే ముగ్గురిని చంపుతానని బెదిరించడంతో తట్టుకోలేకపోయిన బాధిత మహిళ 3రోజుల కిందట అనపర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇరు కుటుంబాలను సోమవారం పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పడంతో వారు వచ్చారు. నాగిరెడ్డి తల్లి భానుమతి యు వతిపై విరుచుకుపడి ఆమె పీక పట్టుకుని కింద పడేసి దాడికి పాల్పడింది. అపస్మారక స్థితికి చేరుకున్న యువతిని ఏరియా ఆసుపత్రికి తరలించడంతో చికిత్స అందించారు. ప్రస్తుతం యువతి ఆరోగ్యం నిలకడగా ఉంది. తల్లీ కుమార్తెల ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సెర్ప్ సీసీ సూర్యనారాయణకు షోకాజ్ నోటీసులు

నిధుల దుర్వినియోగం, విధుల పట్ల నిర్లక్ష్యంపై చర్యలు

మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం

పిఠాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై కాకినాడ జిల్లా పిఠాపురం మండలం సెర్ప్ సీసీ కమ్ ఆఫీస్ అసిస్టెంట్ జి.సూర్యనారాయణకు డీఆర్డీఏ-సెర్ప్ కాకినాడ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొత్తపల్లి మండలంలో సీసీగా పనిచేసిన సమయంలో ఫోర్జరీ సంతకాలతో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు, మహిళలను లైంగికంగా వేధించినట్టు సూర్యనారాయణపై ఆరోపణలొచ్చాయి. దీనిపై కొత్తపల్లి-2 వీవోఏ కె.గాయత్రి ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఎంఎం జిలానీ విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. దీని ఆధారంగా 2023 నవంబరు 1న మంజూరైన స్త్రీ నిధిలోను రూ.3.50 లక్షలను, కొత్తపల్లి క్లస్టర్ సీసీ, ఆఫీసు అసిస్టెంట్‌గా పనిచేసిన సమయంలో సూర్యనారాయణ ఫోర్జరీ సంతకాలతో నిధులు దుర్వినియోగం చేసినట్టు, 2023 మార్చి 24న మంజూరైన స్త్రీ నిధి రుణంలో ఒక సభ్యురాలికి రూ.75వేలకు కేవలం రూ.50వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని తీసుకున్నట్టు, హెచ్ఆర్ నిబంధనలకు విరుద్ధంగా మహిళలను లైంగికంగా వేధిస్తున్నట్టు విచారణ అధికారి తన నివేదికలో వివరించారు. వీటి ఆధారంగా క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సీసీ సూర్యనారాయణను డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు ఆదేశించారు. లేకుంటే తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

వాన మయం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. ఎండలకు అల్లాడుతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. కొన్నిచోట్ల వర్షానికి దారులు చెరువుల్లా మారాయి.



కాకినాడలో వర్షానికి చెరువును తలపిస్తున్న ఓ రహదారి



కాకినాడ నూకాలమ్మ గుడి రోడ్డులో వర్షం నీటిలో వెళ్తున్న వాహనాలు



భారీ వర్షానికి కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురులో చెరువులా మారిన ప్రధాన రహదారి



రాజమహేంద్రవరంలో వర్షానికి తడవకుండా వాహనదారుల జాగ్రత్తలు



కోనసీమ జిల్లా మండపేటలో రహదారిపై వర్షం

జోరు వాన

రావులపాలెం, మే 20(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలంలో మంగళవారం ఉదయం నుంచి 12 గంటల సమయం వరకు జోరుగా వర్షం కురిసింది. దీంతో కొంత మేర జనజీవనం స్తంభించింది. వ్యాపార సముదాయాలు నిర్మానుష్యంగా మారాయి. పల్లపు ప్రాంతాల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది.

వైద్య శిబిరం

మలికిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): లక్కవరంలో కెనరా బ్యాంకులో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమలాపురం మెడ్విన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 60మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో మేనేజర్ జయరామ్, బ్యాంకు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

- ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు
- ముమ్మిడివరంలో మినీ మహానాడు



మినీమహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం, మే 20(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని, అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలోనే రాజధాని అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు పనులు వంటి ఎన్నో పనులకు నిధులు మంజూరు చేయించి ప్రారంభించడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరం విష్ణాలయం సెంటర్ లోని డీఎల్ఎఫ్ ఫంక్షన్ హాలులో మంగళవారం సాయంత్రం జరిగిన మినీమహానాడు సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు 24గంటలు శ్రమిస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో రూ.30కోట్లతో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించామని, రూ.3కోట్లతో అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులు చేశామన్నారు. అన్నక్యాంటీన్‌ను తిరిగి ప్రారంభించామన్నారు. రూ.25కోట్లతో 37ప్రదేశాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులు, పైపులైన్లు నిర్మాణం, రూ.161కోట్లతో ఏఐబీ నిధులతో నగర పంచాయతీలో సమగ్ర మంచినీటి సరఫరా పథకం నిర్మాణం, ఓఎన్జీసీ నష్టపరిహారం కింద చేపల వేట మీద ఆధారపడిన 20 వేల మందికి రూ.133కోట్లు పంపిణీ చేశామన్నారు. రూ.3కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులు, కొత్త రోడ్డు నిర్మాణం. పాత ఇంజరం వద్ద రూ.3కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టామన్నారు. కడపలో 27, 28, 29తేదీల్లో జరిగే మహానాడుకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివరావాలన్నారు. మరో ముఖ్య అతిథి మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఏర్పాటైన పార్టీ టీడీపీ అని అన్నారు. చంద్రబాబునాయుడు విజన్ ఉన్న నాయకుడని, ఆయనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే 17 తీర్మానాలు ప్రవేశపెట్టారు.

తీర్మానాలు.. చంద్రన్నబీమా పునఃప్రారంభం 2014-19 మధ్య ఇళ్ల నిర్మించుకున్న వారికి బిల్లుల చెల్లింపు, జిల్లాలో ఎయిర్‌పోర్టు, మెడికల్ యూనివర్శిటీ ఏర్పాట్లు తదితర 17 తీర్మానాలను ప్రవేశపెట్టారు. వీటిని మహానాడులో నివేదించనున్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. 2024-25 మధ్య మృతిచెందిన టీడీపీ నాయకులకు సంతాపం, ఆపరేషన్ సింధూర్‌లో అమరులైన వీరజవాన్లకు నివాళులర్పించారు. తొలుత సభాస్థలికి ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాలకు చెందిన నాయకులతో ఎమ్మెల్యే ర్యాలీగా తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, మోకా ఆనంద్‌సాగర్, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, టేకుమూడి లక్ష్మణరావు, దాట్ల పృథ్విరాజ్, మందాల గంగసూర్యనారాయణ, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, గొల్లపల్లి ధర్మారావు, వాడ్రేవు వీరబాబు, నడింపల్లి సుబ్బరాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, ధూలిపూడి బాబి, ములపర్తి బాలకృష్ణ, ఆకాశం శ్రీను, చిక్కాల అంజిబాబు, దాట్ల బాబు, గొల్లపల్లి గోపి, కడలి నాగు, కట్టా సత్తిబాబు, అడబాల సతీష్‌కుమార్, దివి మహాలక్ష్మి, సాగి సూరిబాబురాజు, రామలింగరాజు, కాకర్లపూడి రాజేష్, యాళ్ల ఉదయ్, పిల్లి నాగరాజు, దండుప్రోలు సత్యం, కురసాల శివ, రెడ్డి సుధీర్, విళ్ల వీరాస్వామినాయుడు, నిమ్మకాయల విస్సు, మిమ్మితి చిరంజీవి, దంగేటి శ్రీను, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, సరిపెల్ల శ్రీనురాజు, కాశి లాజర్, బొక్కా రుక్మిణి, మెండి కమల, బీర సత్యకుమారి, వాసంశెట్టి అమ్మాజీ, పెదపూడి రుక్మిణి, మోపూరి వెంకటేశ్వరరావు, కుంచనపల్లి నారాయణ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే గిడ్డి



పి.గన్నవరం బూరుగుచానల్ పంటకాల్వలో పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, మే 20(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెం బూరుగు చానల్ పరిధిలో మంగళవారం ఆయన పూడికతీత పనులను ఎమ్మెల్యే ప్రారంభించి అనంతరం మాట్లాడారు. కాల్వలకు నీటి కట్టేయడంతో తొలుత పూర్తిగా అస్తవ్యస్థంగా ఉన్న కాల్వల్లో పూడికతీత పనులు ప్రారంభిచామన్నారు. తాటిపాక ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో పి.గన్నవరం, మామిడికుదురు మండలాలకు సంబంధించి కొర్లగుంటలో ట్రఫ్ నిర్మాణానికి రూ.10లక్షలు, బూరుగుచానల్, బొడపాటి చానల్ పరిధిలో పూడికతీత పనులకు రూ.5లక్షలు, హస్పటల్ చానల్ పరిధిలో పూడికతీతకు రూ.3లక్షలు, ఏనుగుకాల్వ, ముంగండపాలెం కాల్వల్లో పూడికతీతకు రూ.4లక్షలు, మొండెపులంక తూర్పు, పశ్చిమ కాల్వల్లో పూడికతీతకు రూ.4లక్షలు, లూటుకుర్రు, మాకనపాలెం కాల్వల్లో పూడికతీతకు రూ.4లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కాల్వలకు నీరువచ్చే నాటికి పనులు పూర్తి చేసేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ ఆర్.నాగేంద్రకుమార్, జేఈ సుందర్‌సింగ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణమూర్తి, నీటి సంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణరాజు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు, నేరెడిమిల్లి రఘు, కోట రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

మామిడికుదురు, మే 20(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం హితోధిక కృషి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మామిడికుదురులో పంటకాల్వల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంటకాల్వల ఆధునికీకరణలో భాగంగా రిటైనింగ్‌వాల్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి శివారు ప్రాంతాలకు కూడా నీరు అందేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. రూ.10లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణంతో కాల్వ నీరువృథాగా పోదని తెలిపారు. కార్యక్రమంలో డెల్టా నీటిసంఘం అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, మానేపల్లి నీటిసంఘం అధ్యక్షుడు మద్దాల తమ్మన్న(బాబ్జి), టీడీపీ-జనసేన మండలశాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజ, నాయకులు విళ్ల సుబ్బారావు, జాలెం సుబ్బారావు, చుట్టుగుళ్ల కిశోర్, వాసంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసీతారామ ఆవిర్భావ శతాబ్ది మహోత్సవాలు

అయినవిల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలంక గ్రామంలో గల శ్రీసీతారామ చంద్రస్వామి వారి ఆవిర్భావ శతాబ్ది మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, స్వామివారికి న్యాసర్చాన, అష్టకుల పర్వతాలు, అష్ట మంగళ పంచాయుత దర్శనాలు, అష్టోత్తర శత కలశాలతో సుగంధ పరిమళ చందనాది ద్రవ్యాలు, అనేక రకాల ఔషదాలతో స్వామివారి మూలవిరాట్‌కు పరిపూర్ణ అభిషేకం, ఆలయ శిఖరానికి, ధ్వజస్తంభానికి మహా కుంభిషేకం నిర్వహించారు. అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, సర్వదేవత్య ప్రధాన హోమాలు, ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపురాజు సత్యనారాయణరాజు, సలాది పుల్లయ్యనాయుడు, చిట్టూరి వీరవెంకటసత్యనారాయణచౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం

పి.గన్నవరం, మే 20(ఆంధ్రజ్యోతి):ఎన్టీఆర్ అభిమానులు ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని పి.గన్నవరంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అభిమానులు రక్తదాన చేశారు. అమలాపురం సహస్ర బ్లడ్ సెంటర్ వారు 50మంది అభిమానుల నుంచి రక్తాన్ని సేకరించారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. భారీ బాణసంచా కాల్చారు. స్థానిక నాయకులు, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు పుస్తకాలు

- డీఈవో షేక్ సలీంబాషా



రాజోలు: శివకోడులో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో షేక్ సలీంబాషా

రాజోలు, మే 20(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునః ప్రారంభమైన రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టిందని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా తెలిపారు. రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం శివకోడులో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర స్టాక్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నుంచి విద్యార్థులకు సకాలంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లను అందిస్తామని తెలిపారు. పాఠశాలలు తెరిచే నాటికి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆవరణలు, తరగతి గదులు శుభ్రంగా ఉండాలని ఎంఈవో ఎన్.మనోహరం, ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. ప్రభుత్వ బడే మన బడి అని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మంచిఫలితాలు సాధించాయని తెలిపారు. మనబడి-మన భవిష్యత్తు పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర ద్వారా విద్యార్థులకు స్కూలు బ్యాగులు, పుస్తకాలు, మూడు జతల ఏకరూప దుస్తులు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు ఉచితంగా అందిస్తామన్నారు. తల్లికి వందనం పేరిట చదువుకునే ప్రతీ విద్యార్థి తల్లికి రూ.15వేలు ఆమె బ్యాంకు ఖాతాలో వేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పించే చక్కటి సౌకర్యాలను ఉపయోగించుకుని పిల్లలను ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు. సమగ్ర శిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం, ఎంఈవో-2 టీఎస్కేడీ ప్రసాదరావు, పరీక్షా నిర్వాహకులు ఎ.త్రిమూర్తులు, కె.సరస్వతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్యకర్తల పండుగ టీడీపీ మహానాడు

- ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం
- రాజోలు నియోజకవర్గ మహానాడు



మహానాడు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం

మలికిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నిజమైన పండుగ మహానాడు అని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో అడబాల యుగంధర్ అధ్యక్షతన జరిగిన రాజోలు నియోజకవర్గ మహానాడులో ముఖ్య అతిథిగా రాజశేఖరం మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు మూల స్తంభాలని, దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. స్వర్గీయ అన్న ఎన్టీఆర్ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో పేదలకు కూడు, గూడు, నీడ అందించి ఒక చరిత్ర సృష్టించిన మహా నాయకుడు అన్నారు. ఎన్టీఆర్ మహిళలను, బడుగు, బలహీనవర్గాలను అన్నివిధాలా ముందుకు నడిపించారని, అదే బాటలో సీఎం చంద్రబాబునాయుడు నడుస్తూ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజారంజక పాలన జరుగుతుందని, ఇది నిజమైన ప్రజా ప్రభుత్వమని, రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు బహిరంగ సభకు రాజోలు నియోజకవర్గం నుంచి వేలాదిగా రావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గం మహానాడులో రైతు, మహిళా, యువత, పంచాయతీరాజ్, చంద్రన్న బీమా, బీసీల కోసం, ఎస్సీల కోసం తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. కార్యక్రమంలో చిటికెన రామ్మోహనరావు, అడబాల యుగంధర్, గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మొల్లేటి శ్రీనివాస్, కేతా శ్రీనివాస్, మంగెన భూదేవి, మంగెన రాధాకృష్ణమూర్తి, భూపతిరాజు ఈశ్వరవర్మ, గెడ్డం సింహ, ఈలి శ్రీనివాస్, చెల్లుబోయిన శ్రీను, బోళ్ల వెంకటరమణ, రాపాక నవరత్నం, తాడి సత్యనారాయణ, బోనం సాయిరామ్, అడబాల సాయిబాబు, కాకి లక్ష్మణ్, బందెల పద్మ, మోకా పార్వతి, భవానీలావణ్య, హెలీన, మట్టపర్తి లక్ష్మి, అనుసూరి పురుషోత్తం, రాపాక ఆనంద్‌కుమార్, అంతర్వేదిపాలెంపుల్లయ్య, కాండ్రేగుల రాము, కౌరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం.4పై ప్రభుత్వం పునరాలోచించాలి

- వీఆర్వోల వినతి



వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

ఉప్పలగుప్తం, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలకు సంబంధించి జారీ చేసిన జీవో నెం.4పై పునరాలోచించాలంటూ వీర్వోలు మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. క్లస్టర్ విధానంలో సర్దుబాటులో భాగంగా మిగిలిన వీఆర్వోలను ఏ ప్రాతిపదికన, ఏ శాఖలో సర్దుబాటు చేస్తారో చెప్పకుండా తమను అయోమయంలో పడేశారని వినతి పత్రంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఒక సచివాలయ పరిధిలోనే రీసర్వే, రెవెన్యూ సదస్సులు, ఇతర రోజువారీ విధులే కాకుండా ప్రభుత్వ ఆదేశాలతో పలు అత్యవసర కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇప్పటికే ఎందరో వీఆర్వోలు అనారోగ్యం పాలయ్యారని ఆవేదన చెందారు. రెండు సచివాలయాలకు ఒక వీఆర్వో విధుల నిర్వహణ సాధ్యమయ్యే పనికాదన్నారు. ప్రభుత్వం ఈ జీవోపై తక్షణం పునరాలోచన చేయాలని కోరారు. వీఆర్వోల మండల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూర్ అహ్మద్ ఆలీషా, ఎస్కే. వలీ, నాగులపల్లి పళ్ళంరాజు, కోటిపల్లి వెంకటరమణ, శివన్నారాయణ, విన్నా ప్రసాద్, అవిడి రాము, పెట్టా బాలాజీ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

కొత్తపేట, మే 20(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో మంగళవారం ఎడతెరిపిలేని వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముంపు నీరును మళ్లించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అవిడిలో వర్షం నీటికి ధాన్యం రాశులు ముంపునకు గురయ్యాయి. అలాగే ఇటుకబట్టీలకు వర్షం కారణంగా తీవ్ర నష్టానికి గురైన్నట్లు బట్టీ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

చింతలపల్లి-లక్కవరం రోడ్డులో గోతిలో దిగబడిన బస్సు



గోతిలో దిగబడిన బస్సు

మలికిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి వైపు నుంచి రాజోలు వెళుతున్న ఆర్టీసీ బస్సు చింతలపల్లి కళింగలు నుంచి లక్కవరం మధ్య రోడ్డు వెడల్పులో భాగంగా తవ్విన గోతిలో దిగబడింది. ఈరోడ్డు పనులు చేయడానికి గతంలో రోడ్డు పక్కన నాలుగు అడుగుల వెడల్పున ట్రెంచ్ తవ్వారు. మరలా కప్పివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతిలో బస్సు దిగబడి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



అయినవిల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయంతానికి సంఘీభావంగా ముక్తేశ్వరం సెంటర్‌లో మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముక్తేశ్వరం మండల కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల సెంటర్ వరకు త్రివర్ణ పతాకాలతో భారీగా తిరంగా యాత్ర చేశారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, రాష్ట్రఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు, పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ర్యాలీలో వీరవల్లిపాలెం సర్పంచ్ సలాది బుచ్చిరాజు, జనసేన నాయకులు తోలేటి ఉమా, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మద్దా చంటిబాబు, రాష్ట్రమహిళా మోర్చా కార్యదర్శిఆకుమర్తి బేబిరాణి, చీకురుమెల్లి శ్రీనివాసరావు, యనమదల వెంకటరమణ, కనకరాజు, కుమార్, రాజేష్, డ్వాక్రా మహిళలుపాల్గొన్నారు

రేపు హనుమాన్ విజయోత్సవ శోభాయాత్ర



శోభాయాత్ర కరపత్రాన్ని విడుదల చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రముఖులు

అమలాపురం, మే 20(ఆంధ్రజ్యోతి): ఈనెల22న అమలాపురంలోని కళాశాల రోడ్డులో గల విజయత్రిముఖగణపతి ఆలయం నుంచి శ్రీహనుమాన్ విజయోత్సవ శోభాయాత్రను భారీగా నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3గంటలకు ఆలయం నుంచి వేల మంది భక్తులతో ప్రారంభమయ్యే శోభాయాత్ర బ్యాంకు స్ట్రీట్, బస్టాండు రోడ్డు, ముమ్మిడివరం గేట్, ఎర్రవంతెన, శ్రీరామపురం, హైస్కూలు రోడ్డు, కొంకాపల్లి మీదుగా పేరూరు వై.జంక్షన్‌లో గల కోదండ రామాలయం వద్దకు చేరుకుంటుందని నిర్వాహకులు మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌ల కోనసీమశాఖ ఆధ్వర్యంలో జరిగే శోభాయాత్రలో భక్తులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర సత్సంగ ప్రముఖ్ రాళ్లపల్లి పాపయ్యశర్మ, భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు నాయుడు, నగర ప్రముఖ్ ఊటుకూరి సాంబయ్య, శోభాయాత్ర ముఖ నిర్వాహకులు కాళ్లకూరి కుమార్, యక్కల బ్రహ్మేష్, ఉపద్రష్ట శ్రీరామ్‌తోపాటు డాక్టర్ అయ్యగారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ శోభాయాత్ర కరపత్రాన్ని నిర్వాహకులు ఈసందర్భంగా విడుదల చేశారు.

'విద్యుత్ కోతలపై ఆలోచించండి'

మలికిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మే 20 నుంచి జూన్ 5వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ప్రకటించడం పట్ల పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు పలు సూచనలు చేశారు. రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరంలలో పాడైన 30డబుల్ సర్క్యూట్ లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్నారని, ఉదయం నుంచి సాయంత్రం వరకు సరఫరాను నిలుపుదల చేయడం వల్ల వృద్ధులు, చిన్నారులు అత్యవసర సేవలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు.

వెంకన్న ఆలయానికి రూ.1.90కోట్లు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాం, మే 20(ఆంధ్రజ్యోతి): యానాంలో ప్రసిద్ధి చెందిన శ్రీభూసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి రెండో దశలో టీటీడీ రూ.1.90కోట్లు మంజూరు చేసిందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, టీటీడీ మాజీ సభ్యుడు మల్లాడి కృష్ణారావు తెలిపారు. యానాం వెంకన్న ఆలయం వద్ద ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ ఆధ్వర్యంలో యానాంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం రూ.16కోట్లతో ప్రారంభించామన్నారు. తొలి దశలో టీటీడీ ఇచ్చిన రూ.3కోట్లు, ప్రజల విరాళాలు రూ.4కోట్లతో మొత్తం రూ.7కోట్లతో పనులు పూర్తయ్యాయన్నారు. రెండో దశ రూ.9కోట్లకు మంగళవారం జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో రూ.1.90కోట్లు టీటీడీ మంజూరు చేసిందన్నారు. దీంతో రెండో దశ మిగిలిన రూ.7.10కోట్ల కోసం భక్తులు సహకారం, పుదుచ్చేరి ప్రభుత్వ సహాయం కోరామన్నారు. రెండో దశలో టీటీడీ రూ.1.90కోట్లు మంజూరు చేసినందుకు టీటీడీ చైర్మన్, బోర్డు సభ్యులకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి యానాంప్రజల తరపున మల్లాడి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆలయం నిర్మిస్తామని, ఇందుకు భక్తులు విరాళాలు ఇచ్చి సహకరించాలని మల్లాడి కోరారు. సమావేశంలో యానాం ఆలయం పుననిర్మణ కమిటీ ప్రతినిధులు కాపగంటి ఉమాశంకర్, గుత్తుల గోవింద జయరామారావు, మెలగజ్జెల ఆనందరావు, మల్లాడి శామ్యూల్, మాజేటీ మూర్తి, కాద వెంకటేశ్వరరావు, టీఎస్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కొత్తలంక గ్రామ కమిటీ ఎన్నిక

ముమ్మిడివరం, మే 20(ఆంధ్రజ్యోతి): కొత్తలంక టీడీపీ గ్రామకమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. పార్టీ సీనియర్ నాయకుడు నడిమింటి సూర్యప్రభాకరం స్వగృహంలో జరిగిన పార్టీ సమావేశంలో అధ్యక్షుడిగా గుత్తుల మల్లికార్జునరావు, కార్యదర్శిగా బీర శివ, ఉపాధ్యక్షుడిగా దువ్వూరి రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా మేడా శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. దాసరి సాయిబాబు, గీసాల దుర్గాచంద్రరావు, మట్టా గోవిందు, తోలేటి రాంబాబు, వంగా బాబులు, కుచ్చర్లపాటి చిట్టిరాజు, సామంతకుర్తి సుబ్బారావు, రెడ్డి వెంకటేశ్వరరావు, జైన సత్తిబాబు పాల్గొని కొత్తకమిటీని అభినందించారు.

ప్రతీ విద్యార్థికి ప్రభుత్వ విద్యా కిట్ అందిస్తాం

సమగ్రశిక్షా అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మమ్మి



అంబాజీపేటలో పీఎంశ్రీ పనులు పరిశీలిస్తున్న మమ్మి

అంబాజీపేట, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను అందిస్తామని సమగ్రశిక్షా అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మి పేర్కొన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో భద్రపరిచిన కిట్లను మంగళవారం ఆమె సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యంతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మమ్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించి విద్యాకిట్లను అందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు కిట్లు చేరేలా ప్రణాళిక రూపొందించామన్నారు. స్థానిక పాఠశాలలో జరుగుతున్న పీఎంశ్రీ పనులను, క్రీడామైదానాన్ని ఆమె పరిశీలించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకుని వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, సీఆర్పీలు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు

రాజోలు, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగి ఆర్థికంగా వెనుకబడిన కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామని రాష్ట్ర కాపు టీచర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిక్కం మైనరుబాబు తెలిపారు. శివకోడులో శ్రీమంగెన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో రాష్ట్ర కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాజోలు నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్థికంగా వెనుకబడిన కాపు విద్యార్థుల సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా నూతన వర్గాన్ని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోనసీమ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మేడిచర్ల శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజోలు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడిగా ఆరేటి త్రిమూర్తులు, అధ్యక్షుడిగా చవటపల్లి బాలనాగేశ్వరరావు, కార్యదర్శిగా అల్లు శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శిగా మంగెన శ్రీరామకృష్ణ, కార్యనిర్వాహక సభ్యులుగా పిండి నాగవరప్రసాద్, యెరుబండి వెంకటసత్యనారాయణ, ముత్యాల వీరరాఘవనాయుడు, బానిశెట్టి నాగేశ్వరరావు, ఉండపల్లి ఈశ్వరుడు, మిరియాల శ్రీనివాసరావు, గనిశెట్టి మల్లికార్జున్, ఏపుగంటి వెంకటపద్మనాభం, పి.నీలారావులను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. నాగిరెడ్డి శివప్రసాద్ ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని పి.బ్రహ్మాజీరావు, రేకపల్లి నాగబాబు, ఎ.వెంకటసుబ్బారావు, ఎల్.శ్రీమన్నారాయణ, కాపు ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

నేత్రపర్వంగా మల్లమ్మ తీర్థం

ఉప్పలగుప్తం, మే20(ఆంధ్రజ్యోతి): నంగవరం గ్రామదేవత మల్లమ్మతల్లి తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. ఆడపడుచుల ఆధ్వర్యంలో అమ్మవారికి సంప్రదాయ ప్రకారం పూజా కార్యక్రమాలు జరిగాయి. మందపల్లి పళ్ళంరాజు, గనికమ్మ దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గుర్లింక చిన్నా, మందపల్లి వీరబాబు, గుర్లింక వెంకన్నబాబు, కామిరెడ్డి నారాయణరావు, దొడ్డిపట్ల దుర్గారావు, సలాది సాయిరామ్, జిన్నూరి మోహన్, పోలిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా లంకతెల్లమ్మ సంబరం

ముమ్మిడివరం, మే 20(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం గ్రామదేవత లంక తెల్లమ్మవారి జాతర సంబరాలు ఘనంగా ప్రారంభించారు. మొదటిరోజు సోమవారం రాత్రి శ్రీకృష్ణదేవరాయ కాపు యువత ఆధ్వర్యంలో కోయ డ్యాన్సులు, గారడీ, కర్రసాము, కొమ్ముబూరలు వంటి వాయిద్యాలతో గారడీ నృత్యాలు, వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో సంబరాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని సంబరాల్లో పాల్గొన్నారు.

వైభవంగా దాసులమ్మ తీర్థం



కాట్రేనికోన, మే 20(ఆంధ్రజ్యోతి): చెయ్యేరులో గ్రామదేవత దాసులమ్మ తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. దీనికి ముందు అమ్మవారు ఆలయం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పుట్టినింటికి వెళ్లి వడి కట్టించుకుని, అక్కడ నుంచి ఊరేగింపుగా మెట్టినింటికి వెళ్లి వడికట్టు తీసుకుని ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చి, వారు సమర్పించిన చలివిడి, పానకాలు, చీర, జాకెట్లు, గాజులు స్వీకరించి ఆలయానికి తిరిగి వచ్చారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం జరిగింది.

ఘనంగా రావులమ్మ తీర్థం



అంబాజీపేట, మే 20(ఆంధ్రజ్యోతి): కె.పెదపూడి గ్రామదేవత శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా అమ్మవారి ఉయ్యాల సేవ నిర్వహించారు. తీర్థం సందర్భంగా గ్రామమంతా ఆడపడుచులతో కళకళలాడింది. అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కిడ్నీ బాధితుడికి రూ.20వేలు సాయం

అంతర్వేది, మే 20(ఆంధ్రజ్యోతి): మోరిపోడు గ్రామానికి చెందిన రాచపల్లి దుర్గాప్రసాద్ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ సమకూర్చిన రూ.20వేలు మంగళవారం రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, పాటి శివకుమార్ అందించారు. గల్ఫ్ శెట్టిబలిజ యుశక్తి సేవా సంస్థ ఎందరినో ఆదుకుంటుందని ఎంపీపీ కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గుబ్బల శ్రీనివాస్, దొంగ మహేష్, బైరిశెట్టి వెంకటరమణ, బొక్కా పృథ్వి, చెల్లుబోయిన శ్రీనివాస్, గుర్రం నాగవెంకటరాజు, అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు

కేంద్ర బృందం రాకతో ఏర్పాట్లు ముమ్మరం

మండపేట, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు రోజులపాటు పర్యటించే సీనియర్ ఐఏఎస్ అధికారుల బృందం కోసం ద్వారపూడి పంచాయతీ ముస్తాబవుతోంది. నాలుగు రోజుల నుంచి మండలస్థాయి అధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శులు ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. నాలుగు రోజుల నుంచి 40 మంది శానిటరీ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య పనుల్లో నిమ గ్నమ య్యారు. పంచాయతీ కార్యదర్శి ఎవీవీ రమణ, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనివాస్‌ల ఆయా పనులను పర్యవేక్షిస్తున్నారు. అధికారులు పర్యటించే ఎస్సీ కాలనీలను అధికారులు శుభ్రం చేశారు. అధికారుల బృందం ఎంపిక చేసిన 17 పంచాయతీలు, 3 మున్సిపాల్టీల్లో వార్డుల్లో అధికారుల బృందం పర్యటన సాగనుంది. రెండు రోజులు రాత్రివేళ గ్రామాల్లో వారు బస చేయనున్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తజనం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.42లక్షలు

ఆత్రేయపురం, మే 20(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,42,072 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలానికి చెందిన కర్రి వెంకటరెడ్డి, కమలావతి దంపతులు రూ.1,01,116 విరాళం ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేశారు.

ముఖద్వారం నిర్మాణానికి సీఎంఆర్ చైర్మన్ శంకుస్థాపన: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం దాతల విరాళాలతో అభివృద్ధి చెందుతోంది. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి పనులకు బాటలు వేస్తున్నారు. స్వామివారి ఆలయానికి వెళ్లే మార్గాల వద్ద ముఖద్వారాల నిర్మాణానికి దాతల సహకారం కోరారు. రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ వద్ద ముఖద్వారం నిర్మించేందుకు సీఎంఆర్ సంస్థ చైర్మన్ మావూరి వెంకటరమణ దంపతులు ఇటీవల శంకుస్థాపన చేశారు. శిల్పి వడయార్ నేతృత్వంలో రూ.30 లక్షలతో ముఖద్వారం రూపుదిద్దుకోనుంది. బొబ్బర్లంక వద్ద ఆలయానికి వెళ్లే లొల్ల కొత్త వంతెన వద్ద ముఖద్వారాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఆలయ ఉపకమిషనరు, ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

వెండి, బంగారు ఆభరణాల చోరీ

కపిలేశ్వరపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన కపిలేశ్వరపురంలో జరిగింది. వైఎస్ఆర్ కాలనీలో ఉంటున్న ఎం.పోసయ్య, నాగమణి దంపతులు ఇటీవల వేరే ఊరికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో లక్ష విలువైన వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు తెలిపారు. ఇటీవల స్టేషన్ పరిధిలో దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయని, రాత్రివేళల్లో వ్యవసాయ క్షేత్రాల్లోని సామగ్రిని అపహరించుకుపోతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. శివారు ప్రాంతాల ప్రజలు ఇటీవల జరుగుతున్న చోరీలపై భయాందోళనలు చెందుతున్నారు.



మండపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

'ఆ..నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలి'

మండపేట, మే 20(ఆంధ్రజ్యోతి): కార్మికులకు గుదిబండగా మారిన నాలుగు కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి సారథ్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర చట్టం వల్ల కార్మికులకు తీరని నష్టం కలుగుతుందని సత్వరమే ఆ జీవోను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.లోవరాజు, మణికంఠ, గణేష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్లు, రహదారుల ప్రతిపాదనలపై ఎమ్మెల్యే పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

రాయవరం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో డ్రైన్లు, రోడ్ల నిర్మాణం నిమిత్తం అధికారులు ఇచ్చిన ప్రతిపాదనపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. స్థానిక యర్రమట్టిపురం, కృష్ణమ్మ చెరువు, ఆంజనేయనగర్, తూర్పుపేట, తన్నేడివారి వీధుల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అత్యవసరమైన చోట రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం వెంటనే చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, మాజీ సర్పంచ్‌లు నూనె ఏసుబాబు, మోరంపూడి రాజ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, దంగేటి సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 20 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని జల్లిపేటకు చెందిన యాళ్ల శ్రీదేవి ఇటీవల ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబానికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరపున రూ.10 వేల ఆర్థికసాయం అందచేశారు. ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, పలువురు కూటమి నేతల చేతుల మీదుగా వారికి ఆర్థికసాయం అందచేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న కూటమి నాయకులు

చింతలపల్లి-లక్కవరం రోడ్డులో గోతిలో దిగబడిన బస్సు



గోతిలో దిగబడిన బస్సు

మలికిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి వైపు నుంచి రాజోలు వెళుతున్న ఆర్టీసీ బస్సు చింతలపల్లి కళింగలు నుంచి లక్కవరం మధ్య రోడ్డు వెడల్పులో భాగంగా తవ్విన గోతిలో దిగబడింది. ఈరోడ్డు పనులు చేయడానికి గతంలో రోడ్డు పక్కన నాలుగు అడుగుల వెడల్పున ట్రెంచ్ తవ్వారు. మరలా కప్పివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతిలో బస్సు దిగబడి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

నేత్రపర్వంగా మల్లమ్మ తీర్థం

ఉప్పలగుప్తం, మే20(ఆంధ్రజ్యోతి): నంగవరం గ్రామదేవత మల్లమ్మతల్లి తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. ఆడపడుచుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు జరిగాయి. మందపల్లి పళ్ళంరాజు, గనికమ్మ దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది.



అలమూరు మండలం మడికి పంచాయతీ కార్యాలయం వద్ద వర్షం నీరు



కొత్తపేటలో వర్షం కారణంగా ముంపునకు గురైన ఇటుకల బట్టీ



ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయంలో జోరువానలో భక్తుల ప్రదక్షిణ

అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

• తడిసి ముద్దయిన ధాన్యం రాశులు • తలలు పట్టుకుంటున్న రైతులు • వర్షంతో ప్రజల ఉపశమనం

మండపేట, మే 20(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 26 నుంచి రాయలసీమ, దక్షిణకోస్తాతో పాటు పలు జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటనతో రైతులు కలవరం చెందుతున్నారు. మరోపక్క రోహిణికార్తె ఎండలకు ఉక్కిరిబిక్కిరి అయ్యే ప్రజలకు రుతు పవనాలకు ముందే వర్షం కురుస్తుండటంతో ప్రజలు ఊరట చెందుతున్నారు. మంగళవారం మండపేట పట్టణ పరిసర ప్రాంతాలో భారీ వర్షం కురిసింది. పట్టణంలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలు రహదారులు జలమయమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ధాన్యం ఆరబోసుకున్న రైతులకు ఈ వర్షం కొంతమేర నష్టం కలిగించింది.

అలమూరులో భారీ వర్షం

అలమూరు, (ఆంధ్రజ్యోతి): అలమూరులో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడింది. దాళ్వా వరికోతల అనంతరం పశువులకు ఉపకరించే ఎండుగడ్డి ఈ వర్షానికి తడిసి ముద్దయ్యింది. మంగళవారం కురిసిన వర్షానికి ఇటుకబట్టీలకు నష్టం కలిగించింది. అలమూరు మండలం మడికి పంచాయతీ కార్యాలయం వద్ద వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో పంచాయతీ కార్యాలయంలోకి వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అన్నదాతల కలవరం

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన అకాల వర్షంతో పాటు, ఈదురుగాలులకు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసిన పంటను బరకాలతో కప్పి ఉంచినప్పటికీ అక్కడ వర్షం నీరు చేరడంతో కొంతమేర ధాన్యం తడిసి ముద్దయ్యింది. రహదారుల వెంబడి, మెరక ప్రాంతాల్లో వేసిన ధాన్యం రాశుల వద్ద వర్షం నీరు చేరడంతో రైతులు ఆ నీటిని తరలించే పనిలో నిమగ్నమయ్యారు. మంగళవారం పడిన వర్షానికి ఇటుక బట్టీలు తడిసిపోగా, కొన్నిచోట్ల బరకాలు కప్పి కాపాడుకున్నారు. అరటి, కూరగాయలు తదితర పంటలు ఈ వర్షం నష్టం కలిగించింది. చేతికి వచ్చిన పంటలు నష్టానికి గురవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. అకాల వర్షం కారణంగా ఆయా ప్రాంతాల్లో పలు లోతట్టు ప్రాంతాలు జలమయంకావడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



మండపేటలో జోరువర్షంలో వెళుతున్న దృశ్యం

జోరువానలో భక్తురాలి మోకాళ్ల ప్రదక్షిణ

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జోరు వానలో పలువురు భక్తులు ప్రదక్షిణ నోమును ఆచరించారు. ఒక మహిళా భక్తురాలు జోరువానలో మోకాళ్ల నడకతో తన మొక్కును చెల్లించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తజనం ఏడు ప్రదక్షిణలు జరిపి స్వామివారిని దర్శించుకున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో మంగళవారం ఎడతెరిపిలేని వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముంపు నీటిను మళ్లించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అవిడిలో వర్షం నీటికి ధాన్యం రాశులు ముంపునకు గురయ్యాయి. ఇటుక బట్టీలకు తీవ్ర నష్టం కలిగించిందని వాటి యజమానులు వాపోతున్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వ్యాపార సముదాయాలు నిర్మానుష్యంగా మారగా, పలు పల్లపు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది.



కపిలేశ్వరపురం మండలం తాతపూడిలో ధాన్యం రాశికి కప్పిన బరకం

జయంత్ విష్ణు మృతి తీరనిలోటు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 20 (ఆంధ్రజ్యోతి): దేశ ఖగోళ, గణిత శాస్త్రవేత్త, సైన్సు రచయిత జయంత్ విష్ణు నాళికర్ మృతి దేశానికి శాస్త్ర రంగానికి తీరని లోటని రేవతి సైన్సు ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి అన్నారు. మంగళవారం పూణేలో ఆయన కన్నుమూశారని తెలిపారు. ఆయన కృషి, పట్టుదల నేటి యువత, విద్యార్థులకు ఎంతో ఆదర్శమని అన్నారు.

కొనసాగుతున్న శ్రీవాణి దీక్ష



మండపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): కేశవరంలో వున్న ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రక్షణగోడ నిర్మించాలంటూ గ్రామానికి చెందిన వల్లూరి శ్రీవాణి చేస్తున్న శాంతియుత దీక్ష మంగళవారం 33వ రోజుకు చేరింది. మంగళవారం కురిసిన జోరువానను సైతం లెక్కచేయకుండా దీక్షను కొనసాగించారు. పిల్లల భవిష్యత్ కోసం పాఠశాల స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడేందుకు దీక్ష చేస్తున్నానని ఆమె తెలిపారు. రక్షణగోడనిర్మించే వరకు దీక్ష సాగిస్తానని ఆమె అన్నా రు. గోడ నిర్మాణానికి గ్రామంలో వున్న ప్రైవేట్ సంస్థ నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చినా స్థానిక నాయకుల రాజకీయాల కారణంగా పనులు చేపట్టడం లేదని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా పాఠశాలకు రక్షణగోడ తక్షణమే చేపట్టాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఆత్రేయపురం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన యార్లగడ్డ ములసయ్య(78) ఈ నెల 8న వంట చేస్తుండగా గ్యాస్‌పొయ్యి నుంచి మంటలు వ్యాప్తి చెందిన ఘటనలో గాయపడ్డాడు. వెంటనే కుమారుడు వీర్రాజు హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.



లొల్లలో బల్క్ మిల్క్ సెంటర్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

బల్క్‌మిల్క్ సెంటర్ స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో

రాయవరం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల గ్రామంలో బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణానికి కేటాయించిన స్థలాలను మంగళవారం రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల పరిశీలించారు. నిర్మాణానికి స్థలం అనువుగా ఉందా అనే విషయాన్ని పరిశీలించడంతో పాటు స్థానిక మానవతా ఆశ్రమంలో విద్యార్థులకు అందుతున్న సేవలపై విద్యార్థులను ఆరా తీశారు. రాయవరంలో గతంలో నిర్మించిన బల్క్ మిల్క్ సెంటర్ భవనాన్ని ఆమె పరిశీలించారు. ఆర్డీవో వెంట లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, తహశీల్దారు ఐపీ శెట్టి, వీఆర్వో మాధవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రైలింగ్ లేక శిథిలావస్థకు చేరుకున్న పాణింగపల్లి వంతెన

శిథిలావస్థకు చేరుకున్న పాణింగపల్లి వంతెన

కె.గంగవరం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాణింగపల్లి నుంచి నెలపర్తిపాడు వెళ్లే రహదారిలో టేకి డ్రైన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుని ప్రమాదంగా మారింది. వంతెనకు ఒక ప్రక్కన ఉన్న రైలింగ్ పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదవశాత్తూ రైలింగ్ వద్ద అదుపు తప్పితే కాలువలో పడిపోయే అవకాశం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మండలంలోని పాణింగపల్లి, సత్యవాడ, అముజూరు, పామర్రు, యండగండి, కూళ్ల తదితర గ్రామాల ప్రజలు ద్రాక్షారామ వెళ్లేందుకు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తున్నారు. చీకటిపడితే చాలు.. ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు సమస్యను గుర్తించి పాడైన రైలింగ్ చోట వెంటనే మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రజలను అప్రమత్తం చేయడానికి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులతో పాటు ప్రజలు కోరుతున్నారు.

పల్లె పండుగ బకాయిలు చెల్లించరూ...

• బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు • సమస్య పరిష్కరించాలని వినతి



నార్కెడిమిల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు

ఆత్రేయపురం, మే 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం పల్లె పండుగ వారోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీలు, రహదారులు వంటి అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ఏడాది అక్టోబరు 14 నుంచి 20 వరకూ పల్లె పండుగ వారోత్సవాలను జరిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఆయా గ్రామాల్లో పల్లె పండుగ పేరుతో ఎంతో అభివృద్ధి చెందాయి. బిల్లుల చెల్లింపులు ఆరు నెలలు కావస్తున్నా జరగకపోవడంతో ఆయా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఫేజ్-1, 2 ద్వారా రూ.24.49 కోట్లతో 150 పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆయా పనులకు రూ.10లక్షలు మించకపోవడంతో నామినేషన్ పద్ధతిలో పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. నవంబరు, డిసెంబరు నెలలో పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు కొద్దిపాటి బిల్లులు చెల్లించారు. సుమారు 7 నెలలు కావస్తున్నా పల్లె పండుగకు సంబంధించిన పనుల బిల్లులు కాంట్రాక్టర్లకు జమకాలేదు. దీంతో మరికొన్ని పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

చేపట్టిన పనుల వివరాలు: ఆలమూరు మండలంలోని ఫేజ్-1, 2లలో భాగంగా 22 పనులకు రూ.3.21 కోట్లతో చేపట్టారు. ఇంకా ఐదు పనులు చేపట్టాల్సి ఉంది. ఆత్రేయపురం మండలంలో 34 పనులకు రూ.5.21 కోట్లతో చేపట్టగా, తొమ్మిది పనులు చేపట్టాల్సి ఉంది. కొత్తపేట మండలంలో 66 పనులకు రూ.12.56 కోట్లతో చేపట్టాగా, ఇంకా 39 పనులు చేపట్టాల్సి ఉంది. రావులపాలెం మండలంలోని 28 పనులకు రూ.3.65 కోట్లతో పూర్తి చేయగా, 5 పనులు చేపట్టాల్సి ఉంది. కాంట్రాక్టర్లు ఆయా పనులకు సంబంధించిన బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

ద్రాక్షారామ, మే 20(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం ద్రాక్షారామలో నిర్వహించారు. ఎన్టీఆర్ సేవా సమితి రామచంద్రపురం నియోజకవర్గం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మాజీ సైనికులు ఇందాని రాజు, ఎల్. జాన్ తాతారావు, వేపకాయల మహేశ్వరరావులను సత్కరించారు. ఇటీవల భారత్-పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి గౌరవ అధ్యక్షుడు వాసంశెట్టి శ్యామ్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్‌షా, ఎన్టీఆర్ సేవా సమితి అధ్యక్షుడు సాదే రాజేష్‌కుమార్, కార్యదర్శి మణికంఠ , క్రాంతికుమార్, సుబ్రహ్మణ్యం, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



మాజీ సైనికోద్యోగులను సత్కరిస్తున్న ఎన్టీఆర్ అభిమానులు



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా అవుతున్నా పట్టించుకోరా..?

ఆత్రేయపురం, మే 20(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పాటిచెరువు సమీపంలో తాగునీటి జలాలు వృథాగా పోతున్నాయి. బొబ్బర్లంక నుంచి శుద్ధి చేసిన మంచినీరు పైపులైన్ల సరఫరా చేస్తున్నారు. ర్యాలి నుంచి పాటిచెరువు వెళ్లే పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకోకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుద్ధి చేసిన తాగునీరు పైపులైన్ లీకేజీ వల్ల కలుషితమవుతోందని మండిపడుతున్నారు. ర్యాలి వంతెన నుంచి పాటి చెరువుకు వెళ్లే దారిలో చిల్లివారిచింత దగ్గర కాలువగట్టుపై పైపులైన్లు పాడైపోయి తాగునీరు జలాలు వృథాగా పోతున్నాయంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న డొక్కా సీతమ్మ సేవా సంస్థ సభ్యులు

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

రావులపాలెం, మే 20(ఆంధ్రజ్యోతి): రావులపాడుకు చెందిన పెచ్చెట్టి శ్రీనివాస్ రెండు కిడ్నీలు పాడవడంతో వైద్యం చేయించుకునేందుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న డొక్కా సీతమ్మ సేవా సంస్థ సభ్యులు మంగళవారం బాధితుడికి రూ.5వేలు ఆర్థిక సాయం అందచేశారు.

నేడు భగవద్గీత శ్లోకాలపై పోటీలు

రాయవరం, మే 20(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గీతా మందిరం వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ గీతా మందిరం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 5.30 గంటలకు శ్రీకృష్ణుడికి తులసి దళాలతో అర్చనలు, 9 గంటల నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, 11 గంటలకు గీతా మందిరంలో భగవద్గీత శ్లోకాలు శిక్షణ పొం దిన విద్యార్థులతో పాటు వాటిని పఠించే విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం సత్సంగ సభ్యులతో భజనలు, గీతా యజ్ఞం నిర్వహించనున్నట్లుఆయన తెలిపారు.

ఘనంగా రావులమ్మ తీర్థం

అంబాజీపేట, మే 20(ఆంధ్రజ్యోతి): కె.పెదపూడి గ్రామదేవత రాజరాజేశ్వరి అమ్మవారి తీర్థం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా అమ్మవారి ఉయ్యాల సేవ నిర్వహించారు. తీర్థం సందర్భంగా గ్రామమంతా ఆడపడుచులతో కళకళలాడింది. అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.